**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

కవి విధాతగాను కలమును చేపట్టి
సంఘ సంస్కరణకు సైనికుడిగ
సాహితీ సమరము సలుపుచు
సర్వదా
పద్య,కవితల్లి పరవశించు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 15 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 19-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# రోడ్లపై నమాజ్ కుదరదు


## వినకుంటే మరో పద్ధతిలో చెబుతాం.. యూపీ సీఎం హెచ్చరిక

- రహదారులు రాకపోకల కోసమే.. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే ఒప్పుకోం
- మసీదుల్లో స్థలం లేకపోతే షిఫ్టుల వారీగా ప్రార్థనలు చేసుకోవాలి
- ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి..
- లక్నో బహిరంగ సభలో యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ**

రోడ్లపై నమాజ్ చేసే విషయంలో ముస్లింలకు ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరిక జారీ చేశారు. యూపీలో ఇకపై రోడ్లపై నమాజ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లక్నోలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం యోగి పాల్గొన్నారు. -మిగతా 2 లో





# స్మార్ట్‌ఫోన్ల మాయ.. పడిపోతున్న జననాల రేటు!

- మానవ సంబంధాలను దూరం చేస్తున్న డిజిటల్ వేదికలు, సోషల్ మీడియా
- ముఖాముఖి సంభాషణలు కరువై.. భార్యాభర్తల మధ్య తగ్గుతున్న ప్రేమానుబంధం
- మూడు దశాబ్దాల క్రితం సగటున 3.4గా ఉన్న సంతానోత్పత్తి.. ఇప్పుడు 2కు పతనం
- హై-స్పీడ్ 4G ఇంటర్నెట్ వచ్చాకే తగ్గిన జననాలు..
- అంతర్జాతీయ అధ్యయనాల్లో వెల్లడి

**న్యూఢిల్లీ**

మన దేశంలో జనాభా కథ వేగంగా మారిపోతోంది. మూడు దశాబ్దాల క్రితం భారతీయ మహిళలు సగటున 3.4 మంది పిల్లలను కనేవారు. ప్రభుత్వ సర్వే గణాంకాల ప్రకారం ఇప్పుడు ఒక్కో మహిళ ఇద్దరు పిల్లలకు మాత్రమే జన్మనిస్తోంది. వలసలు లేకుండా జనాభా తన పరిమాణాన్ని నిలుపుకోవాలంటే ఒక్కో మహిళ 2.1 మంది పిల్లలను కనాల్సి ఉంటుంది. వాస్తవానికి ఇది ఒక్క మన దేశానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో జననాల రేట్లు గణనీయంగా తగ్గి పోతున్నాయి. పలు దేశాలలో ఒక్కో మహిళ జన్మనిస్తున్న పిల్లల సంఖ్య ఇప్పుడు ఒకటి కంటే తక్కువగా ఉంటోంది. కొన్ని చోట్ల అయితే ఇది జీరోగా కూడా ఉండడం ఆందోళనకర పరిణామం. -మిగతా 2 లో

# సతీశన్ అనే నేను

## కేరళలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణ స్వీకారం**

- పదేళ్ల తర్వాత అధికార పీఠంపై యూడీఎఫ్
- రమేశ్ చెన్నితాలతో సహా 20 మంది మంత్రులుగా ప్రమాణం
- హాజరైన రాహుల్, ప్రియాంక, రేవంత్, ఖర్గే

**తిరువనంతపురం,**

కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆరీఫ్ ఖాన్ ఆయనతో ప్రమాణం చేయించారు. -మిగతా 2 లో







# పోక్సో కేసులో కీలక మలుపు

- బండి భగీరథ్‌కు జీవితఖైదు పడే సెక్షన్ నమోదు
- బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగిందన్న ఆరోపణలు
- ప్రత్యేక అధికారిగా డీసీపీ రితిరాజ్ దర్యాప్తులో కీలక విషయాలు
- నేరం రుజువైతే పదేళ్ల నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష పడే ఛాన్స్

ఏపీ, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోక్సో కేసులో అరెస్ట్ అయిన బండి భగీరథ్‌పై దర్యాప్తు అధికారులు కేసును మరింత తీవ్రతరం చేశారు. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) లోని 64(2)(వీ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే నిందితుడికి పదేళ్లకు పైగా జైలు శిక్ష, కొన్ని సందర్భాల్లో జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నెల 8వ తేదీన బాధితురాలైన మైనర్ పై లైంగిక వేధింపులు జరిగాయని ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పుడు, కేసు నమోదు విషయంలో పోలీసులు హైడ్రామా సృష్టించారని, బలహీనమైన సెక్షన్లు నమోదు చేశారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితురాలి నుంచి వాంగ్మూలం తీసుకునే క్రమంలో పోలీసులు నిజం చెప్పకుండా ఒత్తిడి చేశారన్న విమర్శలు రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గత సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ఈ కేసుకు ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది.

2



# చైనాలో భారీ భూకంపం..

- గ్వాంగ్జీ రీజియన్‌లో రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రత నమోదు
- శిథిలాల కింద చిక్కుకున్న 91 ఏళ్ల వృద్ధుడి ప్రాణాలు కాపాడిన రక్షక సిబ్బంది
- యుజౌ నగరంలో కూలిన భవనాలు.. 7 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- కొండచరియలు విరిగిపడి నిలిచిన రవాణా..
- భయంతో రోడ్లపైకి పరుగులు తీసిన జనం

**న్యూఢిల్లీ**

చైనాలోని నైరుతి ప్రాంతమైన గ్వాంగ్జీ రీజియన్‌లో సోమవారం తెల్లవారుజామున సంభవించిన భారీ భూకంపం తీవ్ర కలకలం రేపింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.2గా నమోదైంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా సంభవించిన వివిధ ప్రమాదాల్లో ఒక దంపతులు (63 ఏళ్ల పురుషుడు, 53 ఏళ్ల మహిళ) దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా ప్రభావితమైన లియుజౌ నగరం నుంచి సుమారు 7,000 మందికి పైగా నివాసితులను అధికారులు అత్యవసరంగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు.భూకంపం ధాటికి లియుజౌలో పలు భవనాలు కుప్పకూలాయి. కొండచరియలు విరిగిపడటంతో -మిగతా 2 లో

# డాలర్ ధాటికి రూపాయి విలవిల..



- రూ. 96.35కు పతనం!
- ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో సరికొత్త జీవితకాల కనిష్టానికి దేశీయ కరెన్సీ
- ఒకే రోజు 54 పైసలు క్షీణత..
- ఒక దశలో 96.39 మార్కును తాకిన విలువ
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదలతో మార్కెట్లలో తీవ్ర ఒత్తిడి
- విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణే రూపాయి పతనానికి ప్రధాన కారణం


2

# సౌదీలో పాక్ సేనల మోహరింపు!



- ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ రంగంలోకి పాకిస్తాన్
- రక్షణగా 8వేల మంది సైనికులు, 16 యుద్ధ విమానాలు
- చైనాతో కలిసి తయారు చేసిన 'జేఎఫ్--17' స్క్వాడ్రన్ సిద్ధం
- ఒకవైపు శాంతి చర్చల మధ్యవర్తిత్వం.. మరోవైపు సైనిక సాయం!

2



# తుపాకీతో శాంతి రాదు.. చర్చలతోనే సాధ్యం:

- రష్యా-ఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలపై నార్వే వేదికగా ప్రధాని కీలక వ్యాఖ్యలు
- ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఓస్లో చేరుకున్న నరేంద్ర మోదీ
- భారత్ - నార్వే మధ్య కుదిరిన డిజిటల్ హెల్త్, 'ఏఐ' అవగాహనా ఒప్పందాలు
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో దేశంలోకి 100 బిలియన్ల పెట్టుబడులు, భారీగా ఉపాధి!

**న్యూఢిల్లీ**

సైనిక ఘర్షణల వల్ల ఏ ఒక్క అంతర్జాతీయ సమస్యకూ శాశ్వత పరిష్కారం లభించదని, చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ప్రపంచంలో శాంతి స్థాపన సాధ్యమవుతుందని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కుండబద్దలు కొట్టారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా స్వీడన్ పర్యటన ముగించుకుని నార్వే చేరుకున్న ప్రధాని మోదీకి ఆ దేశ ప్రధాని జోనాస్ గర్ స్టోర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరు దేశాల అధినేతలు సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం తీవ్ర అస్థిరత, అనిశ్చితిని ఎదుర్కొంటోందని, పశ్చిమాసియా సంక్షోభమైనా, ఉక్రెయిన్ యుద్ధమైనా తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు మద్దతుగా నిలిచిన నార్వేకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. -మిగతా 2 లో

# రణరంగంగా సిరిసిల్ల

## బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల ముష్టియుద్ధం

- పోలీసుల లాఠీచార్జ్!.
- కేటీఆర్, బండి సంజయ్ కు వ్యతిరేకంగా పోటాపోటీ ధర్నాలు, నినాదాలు
- చెప్పులతో దాడి- ముఖ్య నేతల బాహాబాహీ.. రంగంలోకి దిగిన జిల్లా ఎస్పీ
- ఇరు గ్రూపులను చెదరగొట్టి, భారీగా అరెస్టులు

**రాజన్నసిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సోమవారం రాజకీయ రణరంగంగా మారింది. బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఒకే ప్రాంతంలో ఇరు పార్టీల వారు పోటాపోటీగా నిరసనలకు దిగడమే కాకుండా, పరస్పరం దాడులు, చెప్పుల విసురుకోవడాల వరకూ వెళ్లారు. దాంతో సిరిసిల్ల పాత బస్టాండ్ పరిసరాలు గందరగోళంగా మారాయి. పరిస్థితి అదుపు తప్పడంతో జిల్లా ఎస్పీ, -మిగతా 2 లో





## కరీంనగర్ జిల్లాలో 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- రూ. 237 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- రికార్డు స్థాయిలో వారంలో 80 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- రైతులకు ఇబ్బందులు రానివ్వం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్**

కరీంనగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, వచ్చే వారం లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా నిర్దేశించ్నుమని, ఇప్పటి వరకు రైతులకు 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్ -మిగతా 2 లో

# రోడ్లపై నమాజ్ కుదరదు

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లను బ్లాక్ చేసి, నమాజ్ చేయడం సరికాదని సూచించారు. చట్టం అందరికీ సమానమే అన్నారు. అందరూ నన్ను అడుగుతుంటారు. ఉత్తర ప్రదేశ్‌లో ప్రజలు రోడ్లపై నమాజ్ చేయరా అని. అలాంటిది ఇక్కడ ఉండదని చెబుతుంటా. కావాలంటే వెళ్లి చూడమని చెబతా. రోడ్లు ఉన్నవి రవాణా కోసం. ఎవరైనా రోడ్ల మీదకు వచ్చి ట్రాఫిక్ అడ్డుకోవాలని చూశారా..? ఇబ్బంది పెట్టారా..? రోడ్లపై ప్రజలు వెళ్లకుండా అడ్డుకునే హక్కు ఎవరికైనా ఉందా..? కొంతమంతి అడుగుతుంటారు.. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అని. మీ ఇంట్లో అంత స్థలం లేకపోతే.. దానికి అనుగుణంగా జనాభా తగ్గించుకోండి. అనవసరంగా జనాభా పెరగడాన్ని తగ్గించుకోవాలి. ప్రభుత్వ నిబంధన అంటే.. అది చట్టమే. అది అందరికీ సమానంగా వర్తిస్తుంది. నమాజ్ తప్పనిసరి. కానీ, మీ షిఫ్టుకు అనుగుణంగా చేసుకోండి. మేం ఆపం. కానీ, రోడ్లపై నమాజ్ చేయొద్దు" అంటూ యోగి వ్యాఖ్యానించారు.ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలని సూచించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో పర్యటన సందర్భంగా కూడా యోగి ఆదిత్యనాథ్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. కానీ, వాటిని టీఎంసీ పార్టీ ఖండించింది. ఇక, సీఎం యోగి తాజా వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# స్మార్ట్‌ఫోన్ల మాయ.. పడిపోతున్న జననాల రేటు!

మొదటి తరువాయి

**సాంకేతికత వినియోగంతో క్షీణిస్తున్న సంబంధాలు**

సంతానోత్పత్తి రేటు పడిపోవడానికి నిపుణులు అనేక కారణాలు చూపు తున్నారు. పెరుగుతున్న జీవనవ్యయం, ఆలస్యంగా జరుగుతున్న వివాహాలు, వృత్తిపరమైన ఒత్తిడులు, మారుతున్న సామాజిక నియమాలు వంటి అందిరికీ తెలిసిన కారణాలను ప్రస్తావిస్తున్నారు. ఇవి నిజమే అయినప్పటికీ కొందరు పరిశోధకులు స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ వేదికల వైపు వేలెత్తి చూపుతుండడం గమనార్హం. సాంకేతికతను వినియోగించుకోవడం ఎక్కువవుతున్న కొద్దీ మానవ సం బంధా లు క్షీణిస్తున్నాయి. ఇది సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రభావం చూపుతోంది. సిన్సినాటీ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నాథన్ హడ్సన్, హెర్నన్ మాస్కోసో-బోడో ఓ అధ్యయనాన్ని నిర్వహించారు. అమెరికా, బ్రిటన్ దేశాలలో అందుబాటులోకి వచ్చిన 4జీ మొబైల్ ఇంటర్నెట్ సౌకర్యం జననాల రేటుపై చూపుతున్న ప్రభావాన్ని వారు పరిశీలించారు. హై-స్పీడ్ మొబైల్ కనెక్టివిటీ కలిగిన ప్రాం తాలలో జననాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడాన్ని గమనించారు.

**పలుకే బంగార మాయెరా...**

స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో లేనప్పుడు కుటుంబ సభ్యులు... ముఖ్యంగా భార్యాభర్తల మధ్య సంభాషణలు ఎక్కువగా జరుగు తుండేవి. అవి వారి మధ్య ప్రేమానుబంధాన్ని పెంచేవి. స్మార్ట్‌ఫోన్లు రావడంతో పరిస్థితి మారిపోయింది. పలుకే బంగార మాయెరా అన్న చందంగా తయారైంది. ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లోనే కాలం గడిచిపోతోంది. ముఖాముఖి మాట్లాడు కునే సందర్భాలే అరుదైపోతున్నాయి. ఈ ధోరణి కేవలం అమెరికా, బ్రిటన్‌కే పరిమితం కాలేదు. స్మార్ట్‌ఫోన్లు విస్తృతంగా అందు బాటులోకి వచ్చిన సమయంలోనే అనేక దేశాలలో జననాల రేటు పడిపోవడం మొదలైందని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక విశ్లేషణలో తేలింది.

**ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా**

అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాలలో 2000వ సంవత్సరంలోనూ, ఆ తర్వాత టీనేజర్లు, యువతలో జననాల రేటు సాపేక్షంగా స్థిరంగానే ఉంది. అయితే 2007 తర్వాత....అంటే స్మార్ట్‌ఫోన్లు, మొబైల్ యాప్‌లు వంటివి వెల్లువలా వచ్చి పడడంతో ఆ రేటు గణనీయంగా పడిపోయింది. చిన్న వయసు వారిలో సంతానోత్పత్తి రేటు తగ్గుదల మరింత తీవ్రంగా ఉంటోంది. అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లు వినియోగించేది వీరే కావడం విశేషం. దీనికితోడు మానవ సంబంధాలపై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉంటోంది. యువత ఎక్కువగా సామాజిక మాధ్యమ వేదికలకు అతు క్కుపోతుండడంతో వారిలో లైంగిక సామర్థ్యం క్షీణిస్తోంది. వైవాహిక జీవితంపై ఆసక్తి కలగడం లేదు. మానవ సంబంధాలు దీర్ఘకాలం కొనసాగకపోవడానికి సోషల్ మీడియాయే కారణమని కొందరు శాస్త్రవేత్తలు వాదిస్తున్నారు. సామాజిక మాధ్యమ వేదికలు యువత జీవన శైలిని మార్చేస్తున్నాయి. ఆర్థిక పరంగా ఆందోళనకు గురిచేస్తున్నాయి. సామాజిక పోలికలను సృష్టిస్తున్నాయి. దీంతో యువతలో అభద్రత, అస్థిరత నెలకొంటోంది.

# పోక్సో కేసులో కీలక మలుపు

మొదటి తరువాయి

**డీసీపీ రితిరాజ్ ప్రత్యేక దర్యాప్తు..**

వెంటనే రంగంలోకి దిగిన డీసీపీ రితిరాజ్, గత సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు ఫైళ్లను పరిశీలించారు. పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలంలో స్పష్టత లేదని గుర్తించి, దర్యాప్తును లోతుగా చేపట్టారు. గత మంగళవారం డీసీపీ స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి, ఆమెతో స్నేహపూర్వక వాతావరణంలో మాట్లాడారు. పోక్సో కేసుల దర్యాప్తు నిబంధనల ప్రకారం, ఆమె నుంచి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. బాధితురాలు చెప్పిన విషయాలకు, పోలీసులు మొదట నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేదని గ్రహించారు.

# చైనాలో భారీ భూకంపం..

మొదటి తరువాయి

రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. శిథిలాల కింద చిక్కుకున్న 91 ఏళ్ల వృద్ధుడిని రెస్క్యూ టీమ్ సురక్షితంగా బయటకు తీసింది. గాయపడిన మరో నలుగురిని ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని ప్రభుత్వ అధికారిక వార్తా సంస్థ 'జిన్హువా' వెల్లడించింది. కాగా, గల్లంతైన వారి కోసం ప్రభావిత ప్రాంతాల్లో గాలింపు, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# తుపాకీతో శాంతి రాదు.. చర్చలతోనే సాధ్యం:

మొదటి తరువాయి

**పదేళ్లలో రెండింతలైన వ్యాపారం.. కుదిరిన కీలక ఒప్పందాలు:**

భారత్-యూరప్ దేశాల మధ్య గతంలో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చారిత్రాత్మకమైనదని, దీని ద్వారా భారత్‌కు దాదాపు 100 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులతో పాటు యువతకు భారీగా ఉపాధి అవకాశాలు రానున్నాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. తాజా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య డిజిటల్ హెల్త్, రీసెర్చ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , హెల్త్ టెక్నాలజీ వంటి రంగాల్లో కీలక అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. గత పదేళ్లలో రెండు దేశాల మధ్య వాణిజ్యం రెండింతలు పెరిగిందని, రాబోయే రోజుల్లో గ్రీన్ ఎనర్జీ, సీఫుడ్, ఇన్నోవేషన్ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని మోదీ వివరించారు.

# సతీశన్ అనే నేను

మొదటి తరువాయి

కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే.మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌కు స్థానం లభించింది. అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపక్షాల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కునాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.



**రాజకీయ ప్రత్యర్థికి హోం శాఖ.. సతీశన్ సంచలనం**

కేరళ రాజకీయాల్లో ఓ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్, అత్యంత కీలకమైన హోం శాఖను తన వద్ద ఉంచుకోకుండా పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థిగా పేరున్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కేటాయించారు. ఇది పార్టీలో అంతర్గత విభేదాలకు ముగింపు పలికి, సమన్వయంతో ముందుకు సాగాలనే సంకేతాలను ఇస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని చెన్నితాల ధ్రువీకరించారు. "పదేళ్ల తర్వాత యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన ఈ రోజు కేరళ ప్రజలకు శుభదినం. ప్రజలకు సుపరిపాలన అందించడమే మా కర్తవ్యం. నేను హోం శాఖ బాధ్యతలు చేపట్టబోతున్నాను" అని ఆయన తెలిపారు.

**స్పష్టమైన ఆధిక్యంతో యూడీఎఫ్ విజయం**

ఈ నెల 4వ తేదీన వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో యూడీఎఫ్ కూటమి అద్భుత విజయం సాధించింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను యూడీఎఫ్ 106 సీట్లు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 63, దాని ప్రధాన మిత్రపక్షానికి 22 సీట్లు దక్కాయి. మరోవైపు, అధికారంలో ఉన్న వామపక్ష కూటమి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) కేవలం 35 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయం చవిచూసింది. సీపీఎం 26, సీపీఐ 8 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. దేశంలో వామపక్షాలు అధికారంలో ఉన్న చివరి రాష్ట్రమైన కేరళలో కూడా అధికారం కోల్పోవడం గమనార్హం.

# డాలర్ ధాటికి రూపాయి విలవిల..

- **-రూ. 96.35కు పతనం!**
- **ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో సరికొత్త జీవితకాల కనిష్టానికి దేశీయ కరెన్సీ**
- **ఒకే రోజు 54 పైసలు క్షీణత..**
- **ఒక దశలో 96.39 మార్కును తాకిన విలువ**
- **అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదలతో మార్కెట్లలో తీవ్ర ఒత్తిడి**
- **విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణే రూపాయి పతనానికి ప్రధాన కారణం**



**న్యూఢిల్లీ**

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డు పతనాన్ని చవిచూసింది. ముడి చమురు ధరలు విపరీతంగా ఎగబాకడం, గ్లోబల్ మార్కెట్లలో అమెరికా డాలర్ బాగా బలోపేతం కావడంతో సోమవారం నాటి ట్రేడింగ్‌లో భారతీయ రూపాయి ఏకంగా 54 పైసలు క్షీణించి 96.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే 96.19 వద్ద బలహీనంగా ఓపెన్ అయిన కరెన్సీ, ఒక దశలో అత్యంత కనిష్టంగా 96.39 మార్కును తాకింది. గడిచిన శుక్రవారం రూపాయి విలువ 95.81 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.

**రూపాయిపై ఒత్తిడికి కారణాలివే:**

అమెరికా--ఇరాన్ మధ్య నిరంతరాయంగా కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఫారెక్స్ వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. చమురు ధరలు పెరగడం వల్ల భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి డాలర్లు బయటకు వెళ్లడం భారీగా పెరిగింది. దీనికి తోడు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు సైతం భారత మార్కెట్ల నుండి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటూ డాలర్లను వెనక్కి తీసుకెళ్తుండటం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. అమెరికా ట్రెజరీ బాండ్ల ఆదాయం పెరగడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగుతుండటంతో రాబోయే రోజుల్లో కూడా రూపాయి విలువ మరింత బలహీనపడే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# సౌదీలో పాక్ సేనల మోహరింపు!

- **ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ రంగంలోకి పాకిస్తాన్**
- **రక్షణగా 8వేల మంది సైనికులు, 16 యుద్ధ విమానాలు**
- **చైనాతో కలిసి తయారు చేసిన 'జేఎఫ్--17' స్క్వాడ్రన్ సిద్ధం**
- **-ఒకవైపు శాంతి చర్చల మధ్యవర్తిత్వం.. మరోవైపు సైనిక సాయం!**



**న్యూఢిల్లీ**

ఇరాన్--అమెరికా యుద్ధ సమయంలో పాకిస్తాన్ వైఖరి అనేక అనుమానాలకు తావిచ్చింది. సౌదీ అరేబియాలో పాకిస్తాన్ భారీ సైన్యాన్ని మోహరించినట్లు తాజాగా వెల్లడైంది. అంతేకాదు.. సౌదీ అరేబియాకు రక్షణగా 16 యుద్ధ విమానాల్ని కూడా పాక్ అందుబాటులో ఉంచినట్లు తేలింది. ఈ విషయాన్ని పాక్, సౌదీ అరేబియాకు చెందిన సైనిక ఉన్నతాధికారులు వెల్లడించారు.అయితే, అధికారికంగా మాత్రం కాదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సౌదీ అరేబియాకు పాకిస్తాన్ 8,000 ట్రూపుల్ని, స్క్వాడ్రన్ యుద్ధ విమానాల్ని పంపించింది. ఒకవేళ మళ్లీ సౌదీ అరేబియాపై దాడి జరిగితే స్పందించేందుకు పాక్ సైనికులతోపాటు, యుద్ధ విమానాలు కూడా సిద్ధంగా ఉంచారు. చైనాతో కలిసి తయారు చేసిన జేఎఫ్--17 అనే 16 యుద్ధ విమానాల్ని పాక్.. సౌదీలో మోహరించింది. అవసరమైతే మరింతమంది సైన్యాన్ని, యుద్ధ విమానాల్ని కూడా పంపిస్తామని సౌదీకి తెలిపింది. పాకిస్తాన్, సౌదీ అరేబియా మధ్య ఏడాది క్రితం రక్షణ ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించిన స్పష్టమైన విధి విధానాలు తెలియవు. కానీ, సైనిక పరంగా అవసరమైనప్పుడు ఒకదానికి ఒకటి సహకరించుకోవాలన్నది ప్రధాన ఒప్పందం. ఎందుకంటే సౌదీ అరేబియా వద్ద సొంత సైన్యం, యుద్ధ విమానాలు పెద్దగా లేవు. అందువల్ల ఈ విషయంలో పాక్ సాయం అడిగింది. సౌదీకి ఎప్పుడు అవసరమైనా.. పాక్ సైనిక సాయం అందించాలి. పాకిస్తాన్‌కు అవసరమైనప్పుడు కూడా సౌదీ సాయపడాలి. ఇక, తాజాగా సౌదీలో పాక్ సైనిక మోహరింపుపై ఇటు పాక్.. అటు సౌదీ అధికారికంగా మాత్రం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇటీవల సౌదీపై ఇరాన్ పలుసార్లు దాడులకు దిగింది. ఇదే సమయంలో సౌదీ కూడా ఇరాన్‌పై దాడులకు పాల్పడింది. కానీ, దీనిపై ఇరాన్ నుంచి ఎటువంటి ప్రకటనా రాలేదు. పాకిస్తాన్ ఒకవైపు ఇరాన్--అమెరికా మధ్య శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తూనే.. ఇరాన్‌కు వ్యతిరేకంగా సౌదీలో తన సైన్యాన్ని మోహరించడం ఇక్కడ విశేషం.

# రణరంగంగా సిరిసిల్ల

మొదటి తరువాయి

డీఎస్పీ రంగంలోకి దిగిం లాఠీచార్జి చేసి ఇరు గ్రూపులను చెదరగొట్టారు. బాలిక అంశంలో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ ను తక్షణమే మంత్రివర్గం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలపడానికి పోలీసుల అనుమతి తీసుకున్నారు. అనంతరం పాత బస్టాండ్ ప్రాంతంలోని నేతన్న చౌక్ వద్ద బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో ధర్నాకు దిగారు. బండి సంజయ్ రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం ఆయన్ను బర్తరఫ్ చేయాలని, బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి ?కౌంటర్‌గా.. గతంలో ?22 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన కేటీఆర్‌ను శిక్షించాలని, గ్లోబరీనా సంస్థపై 'సిట్' ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు సైతం అదే సమయంలో నేతన్న చౌక్‌కు చేరుకుని ధర్నాకు ఉపక్రమించాయి.

**నేతన్న చౌక్ వద్ద ఉద్రిక్తత.. చెప్పుల వర్షం**

ఒకే వేదిక (నేతన్న చౌక్) సమీపంలో ఇరుపార్టీల శ్రేణులు భారీగా మోహరించడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ శ్రేణులు 'బండి సంజరు డౌన్ డౌన్' అంటూ, బీజేపీ శ్రేణులు 'కేటీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎదురెదురుగా నిలబడి గొంతు చించుకున్నారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి, పరస్పర దాడులకు దారితీసింది. నేతలు, కార్యకర్తలు బాహాబాహీకి దిగి ముష్టియుద్ధం చేసుకున్నారు. ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకోవడంతో నేతన్న చౌక్ పరిసరాలు రణరంగాన్ని తలపించాయి.

**రంగంలోకి పోలీస్ బాస్.. లాఠీచార్జి, అరెస్టులు**

జిల్లా ఎస్పీ మహేష్ బిగితే, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి అదనపు బలగాలతో రంగప్రవేశం చేశారు. ఘర్షణ పడుతున్న ఇరు పార్టీల వారిని వారించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. మొదట బీజేపీ శ్రేణులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు కలెక్టరేట్ సమీపంలో బండి సంజరు భారీ ఫ్లెక్సీతో మరోసారి ధర్నాకు దిగారు. అక్కడ కూడా ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన బీఆర్ఎస్ నాయకుల్లో నాఫ్స్‌క్యాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్ రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డిబోయిన గోపి, పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్‌తోపాటు పలువురు ముఖ్య నాయకులు అరెస్టయ్యారు. ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీసులు భారీగా మోహరించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.?

# కరీంనగర్ జిల్లాలో 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

మొదటి తరువాయి

అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సీజన్లో 3.61 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటికీ 3 లక్షల ఒక వెయ్యి మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల కోసం వచ్చిందని తెలిపారు. వచ్చిన ధాన్యం నుండి ఒక లక్ష 58 వేల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేశామని, రైతులకు ఇందుకు సంబంధించి 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 80,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. రానున్న వారంలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికతో



ఉన్నామని అన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉంటూ సజావుగా సాగేలా చూడాలని తెలిపారు. రానున్న రెండు వారాలు మరింత కీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీల సమస్య ప్రధానంగా కనిపిస్తోందని, లోకల్ హమాలీలను ప్రోత్సహిస్తూ ఈ సమస్యను అధిగమించాలని మంత్రి సూచించారు. ధాన్యం రవాణాకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారులు ఇచ్చామని, లారీ అసోసియేషన్ ప్రతినిధులు సహకరించి కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రాన్స్పోర్ట్ కు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూసుకోవాలని, జిల్లా పంచాయతీ అధికారి హమాలీల సమస్య పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# మనిషి వ్యక్తిగత ఎదుగుదల సమాజ అభివృద్ధి కి పునాది

**దేవరకొండ మే 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
మనిషి ఆలోచించి విధానం, పరిస్థితులను చూసే కోణం, నిర్ణయాలు తీసుకునే తీరు, విధానమును మైండ్ సెట్ (మనస్తత్వం) అంటారు.
మన జీవితం ఎదుగుదలను ,నిర్ణయించే అంశం మన మనస్తత్వం మీద ఆధారపడి ఉంటుంది.
కొన్ని రకాల మనస్తత్వాలు మనిషి ఎదుగుదలకు దారి చూపుతాయి. కొన్ని రకాల మనస్తత్వాలు మనిషి ఎదుగుదలను, వెనక్కి లాగుతాయి. సహజంగా మనిషిలో గల మనస్తత్వాలను పరిశీలించినట్లయితే ఏడు రకాలుగా వర్గీకరించవచ్చును.
01.చిన్న మనస్తత్వం :చిన్న మనస్తత్వం ఉన్నవారు పెద్దగా ఆలోచించరు, తమకు తెలిసిన చిన్న పరిధిలోని జీవించాలి. అనుకుంటారు, నాకు ఇదే సరిపోతుంది అనే భావన కొత్త విషయాలు నేర్చుకోవాలని ఆసక్తి లేకపోవడం, ఇతరుల విజయాన్ని చూసి భయపడటం. పెద్ద లక్ష్యాలు పెట్టుకోకపోవడం ,దీన్ని వలన జీవితంలో ఎదుగుదల తగ్గిపోతుంది. అవకాశాలు కోల్పోతారు, ఆత్మవిశ్వాసం తగ్గుతుంది. 02.ఇరుకైన మనస్తత్వం: ఇతరుల అభిప్రాయాలను అంగీకరించకుండా తన ఆలోచన సరైందని భావించడం ఇతరుల మాటలు వినకపోవడం, కొత్త ఆలోచనలను తిరస్కరించడం , తేడాలను అర్థం చేసుకోకపోవడం ,త్వరగా నిర్ధారణ చేయడం ,వీటి వలన సంబంధాలు దెబ్బతింటాయి జ్ఞానం పెరగదు. ఎక్కువ మంది సభ్యులతో కలిసి ఉండలేరు.
03. నెగిటివ్ మనస్తత్వం: ప్రతి విషయంలో చెడుమాత్రమే వెతకడం, నేను చేయలేను అనుకోవడం ఎప్పుడూ భయం సందేహం చిన్న సమస్యలను పెద్దగా ఊహించడం ఎక్కువగా నిరాశ చెందడం వీటి వలన, మానసిక ఒత్తిడి పెరుగుతుంది అవకాశాలు వదులుకోవడం, ప్రశాంతతను



కోల్పోవడం జరుగుతుంది.
4. బద్ధకపు మనస్తత్వం: చేయగలిగిన పనిని వాయిదా వేయడం తర్వాత చేద్దాం అనే వాయిదాలతో సమయాన్ని వృధా చేయడం క్రమశిక్షణ లేకపోవడం కష్టపడడానికి ఆసక్తి చూపకపోవడం వీటి వలన లక్ష్యాలను చేరుకోలేరు. సమయం విలువ తెలియదు ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఇతరుల కంటే తమ వ్యక్తిగతంగా మరియు కుటుంబ పరంగా వెనుకబడి ప్రమాదం ఉంది .కావున పై నాలుగు రకాల మనస్తత్వాలను పూర్తిస్థాయిలో తొలగించుకోవాలి మరియు మన జీవన శైలి ఇప్పుడు ఉన్న స్థితి నుంచి మెరుగైన జీవనశైలికి మారాలి అంటే కొన్ని రకాల మనస్తత్వాలను అభివృద్ధి చేసుకోవడం ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో తక్షణ అవసరం ఎంతైనా ఉంది .వాటి గురించి తెలుసుకునే క్రమంలో భాగంగా మొదటగా
5. ఎదుగుదల మనత్వత్వం. తప్పులనుండి నేర్చుకుని ముందుకు వెళ్లే ఆలోచన విధానం కొత్త విషయాలు నేర్చుకోవడం ఫెయిల్యూర్ ని పాఠంగా ,తీసుకోవడం కష్టపడడానికి సిద్ధంగా ఉండడం. నేను నిరంతరం నేర్చుకుంటాను. అనే భావనతో, ఆలోచించి పనిచేయడం, వలన నైపుణ్యం ,ఆత్మవిశ్వాసం పెరుగుతుంది .ఎంచుకున్న వృత్తిలో విజయపథంలో కొనసాగుతారు.
6. మెచ్యూరిటీ మనసత్వతం: భావోద్వేగాలను నియంత్రిస్తూ అర్థంతో ,నిర్ణయాలు తీసుకోవడం కోపాన్ని, అదుపులో ఉంచుకోవడం పరిస్థితులను అర్థం చేసుకొని బాధ్యతగా ప్రవర్తించడం. ఇతరులను గౌరవించడం వలన మంచి సంబంధాలు ఏర్పడతాయి గౌరవం పెరుగుతుంది ప్రశాంతమైన జీవితం ఉంటుంది. 7. మెచ్యూరిటీ మనసత్వతం: ఎదుగుదల మరియు మెచ్యూరిటీ కలిసినప్పుడు వ్యక్తి జీవితంలో గొప్ప మార్పు వస్తుంది నేర్చు కుంటూనే వినయంగా ఉండడం భాగోద్వేగాలను నియంత్రిస్తూ ఎదగడం ,విజయాన్ని గర్వంగా కాకుండా బాధ్యతగా చూడడం సమస్యలకు పరిష్కారం వెతకడం వీటి వలన వ్యక్తిత్వం, బలపడుతుంది .నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. జీవితంలో స్థిరమైన విజయం సాధిస్తారు.
మన భవిష్యత్తు మన మనస్తత్వం మీద ఆధారపడి ఉంటుంది చిన్న ఇరుకైన నెగిటివ్ బద్ధకపు ఆలోచనలు వదిలి ఎదుగుదల మెచ్యూరిటీ పాజిటివ్ ఆలోచనలు పెంపొందించుకుంటే జీవితం మంచి విజయవంతమైన దారిలో కొనసాగుతుంది.
ఆలోచన మారితే జీవితం మారుతుంది



**కామేపల్లి లక్ష్మయ్య.**
**సామాజిక వైద్యులు.**
**9542311846.**

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని బీజేపీ ధర్నా




**మర్రిగూడ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి చౌరస్తాలో ధర్నా చేపట్టారు."దేశానికి అన్నం పెట్టే రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నెలరోజులు గడిచినా కొనుగోలు జరగకపోవడంతో నష్టపోతున్నారు. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి రైతులు మరింత ఇబ్బంది పడతారు" అని నాయకులు విమర్శించారు.స్థానిక తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతుల డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్ నాయక్, పిట్టల శ్రీనివాస్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు చెరుకు శ్రీరామ్ గౌడ్, నారోజు కుమారస్వామి, మోదుగుల రాజు, శ్రీరాములు, గుణగంటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ను ఢీకొట్టి పారిపోతున్న లారీ డ్రైవర్‌ను పట్టుకున్న యువకుడు




**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్లో సోమవారం ఉదయం జరిగిన ఘోర ప్రమాదంలో లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ వాహనంతో పరారయ్యాడు.ఈ సమయంలో గన్నేరువరం మండలం మైలారం గ్రామానికి చెందిన బుర్ర చంద్రశేఖర్ అప్రమత్తమై బైక్‌పై వెంబడించాడు. లారీ డీజిల్ ట్యాంక్ లీక్ కావడంతో రోడ్డుపై పడిన ఆనవాళ్లను ఆధారంగా చేసుకుని కరీంనగర్ పట్టణం వరకు వెంబడించి, రాజా థియేటర్ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద డ్రైవర్‌ను గుర్తించి పట్టుకున్నాడు.మాజీ జెడ్పిటిసి మడుగుల రవీందర్ రెడ్డి సహకారంతో పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు అక్కడికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ప్రమాదానికి గురైన లారీ నంబర్ ఏపీ29వి1555గా గుర్తించగా, డ్రైవర్‌తో పాటు ఓనర్ కూడా అతడేనని, అతని పేరు లిమొహాద్ ఎస్సా (56)లిగా పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పారిపోతున్న లారీ డ్రైవర్‌ను ధైర్యసాహసాలతో పట్టుకున్న నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి బుర్ర చంద్రశేఖర్ పై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ఉప్పల్ చౌరస్తా తాత్కాలిక మూసివేత




**ఉప్పల్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



ఎప్పుడూ రద్దీగా ఉండే ఉప్పల్ చౌరస్తాను ఆదివారం నుంచి అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. విద్యుత్ జంక్షన్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు.వరంగల్ వైపు వెళ్లే వాహనాలను ఉప్పల్ రింగ్ రోడ్ మీదుగా దారి మళ్లిస్తున్నారు. ఇప్పటికే వరంగల్ బస్టాప్‌ను ఉప్పల్ నల్ల చెరువు కట్ట వద్దకు మార్చిన విషయం తెలిసిందే.హబ్సిగూడ నుంచి వరంగల్ వైపు వెళ్లే భారీ వాహనాలు నాచారం, మల్లాపూర్, ఐవోసీ, చెంగిచర్ల మీదుగా రహదారికి చేరుకోవాలి. చిన్న వాహనాలు ఇందిరాగాంధీ పార్క్ నుంచి లిటిల్ ఫ్లవర్ వెనక దారి ద్వారా వరంగల్ రహదారికి చేరుకోవచ్చు. వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు ఏషియన్ థియేటర్ ఎదుటి హెచ్ఎండీఏ రోడ్డుతో నాగోల్ రోడ్డుకు కలుస్తాయి. ద్విచక్ర వాహనాలు నాగోల్ మెట్రో పిల్లర్లు 812, 813 నుంచి ఉప్పల్, సికింద్రాబాద్ వైపు వెళ్లాలి.భారీ వాహనాలు నాగోల్ బ్రిడ్జి కింద యూ--టర్న్ తీసుకుని హెచ్ఎండీఏ లే అవుట్ ద్వారా వరంగల్ హైవేకు చేరుకోవాలి. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చే బస్సులు, లారీలు, భారీ వాహనాలు ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్ ద్వారా నగరానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

**- సిఐటియు**



**కల్వకుర్తి, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకుడు బండపల్లి శివరాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.సోమవారం కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద ఆశా వర్కర్లు ధర్నా చేపట్టగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో వ్యక్తి చాకిరి చేయించుకుంటున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి, ఫిక్స్ వేతనం రూ. 18,000తో పాటు పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, పని భారాన్ని తగ్గించాలని ఆయన కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్ కుమార్కు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి యాదమ్మ, నాయకురాలు వసంత, వంగూరు మండల అధ్యక్షురాలు సుమతమ్మ, తోటపల్లి పిహెచ్సి అధ్యక్షురాలు సుభద్ర, అలాగే నాగమణి, హుస్సే నమ్మ, విమల, హరి భాయ్, బాలమని, లక్ష్మమ్మ, నీల, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మల్లికార్జున నాటకానికి సర్పంచ్ విరాళం



**వెల్దండ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలో కళా నాట్య మండలి ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున నాటక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్తో పాటు గ్రామ ప్రజలు వీక్షించారు.సాంప్రదాయ కళారూపాల పట్ల తన అభిమానం వ్యక్తం చేస్తూ సర్పంచ్ కొండల్ యాదవ్ కళా నాట్య మండలికి రూ. 15,000 విరాళం అందజేశారు. "మల్లికార్జున నాటకం వంటి సంప్రదాయ కళారూపాలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తూ, కొత్త తరాలకు ఆధ్యాత్మిక విలువలను చేరవేస్తాయి" అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ సభ్యులు, కళా నాట్య మండలి సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన 187 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని సంబంధిత అధికారులకు బదిలీ చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు.కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో



56, హుజురాబాద్ డివిజన్‌లో 26 దరఖాస్తులు స్వీకరించగా, కలెక్టరేట్‌లో 187 దరఖాస్తులు అందాయి. మొత్తంగా జిల్లాలో 269 దరఖాస్తులు సమర్పించబడ్డాయి.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదికగా నిలుస్తోందని అధికారులు తెలిపారు.

# 48 ఏళ్లకు నువ్వు ఎమ్మెల్యేవు

-బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి



**కర్నూల్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంత్రి టీజీ భరత్ వ్యాఖ్యలపై వైఎస్ఆర్సీపీ రాష్ట్ర విభజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మండిపడ్డారు. దళిత యువకుడు సతీశ్ కుటుంబానికి న్యాయం చేయాలని అడిగితే, “ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకో” అని సమాధానం చెప్పడం వింతగా ఉందని ఆయన విమర్శించారు.“33 ఏళ్లకే నేను వైఎస్ఆర్సీపీ తరఫున ఎన్నో నియోజకవర్గాల్లో ప్రచారం చేశాను, ర్యాలీలు, ధర్నాలు చేశాను. కానీ మంత్రి భరత్ 48 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యే అయ్యారు. 43 ఏళ్ల వయసులో మొదటిసారి పోటీ చేశారు. నా వయసు ఇప్పుడు 33 ఏళ్లు. మీ వయసుకు వచ్చేలోపు నేను ఎమ్మెల్యేగా పోటీ చేయకపోతే అప్పుడు నన్ను ప్రశ్నించండి” అంటూ ఆయన మీడియా ద్వారా సూటిగా ప్రశ్నించారు.మంత్రి భరత్ తనపై విమర్శలు చేసే వారికి బహుమతులు ఇస్తున్నారని కూడా ఆయన ఆరోపించారు.

# ప్రభుత్వ భూముల కబ్జాలపై పిడిశెట్టి రాజు ఫిర్యాదు



**హుస్నాబాద్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు డిమాండ్ చేశారు.సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు సమర్పించిన ఆయన, రెవిన్యూ అధికారులు ప్రత్యేక చొరవ చూపి భూములను పరిరక్షించాలని కోరారు. కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 400లో 170 ఎకరాల భూమి కబ్జాలకు గురైందని, పారదర్శక సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి హద్దులు నిర్మించి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే నకేరకొమ్ముల గ్రామ శివారులో 27 ఎకరాల 20 గుంటల భూమిని లబ్ధిదారులకు కేటాయించి పట్టాలు ఇచ్చిన నేపథ్యంలో, వారికి పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారు ఎంతటి వారైనా సరే శిక్షించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు ఉల్లంగుల లింగచారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ భూముల కబ్జాదారులపై కఠిన చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని పిడిశెట్టి రాజు స్పష్టం చేశారు.

# ఉచిత త్రాగునీరు పంపిణీ




**నందికొట్కూరు, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎస్. భాజీ ఆదేశాల మేరకు, నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్ వద్ద దూదేకుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వాటర్ బాటిల్స్ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్ హాజరై ప్రజలకు వాటర్ బాటిల్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “వేసవి కాలంలో ఎండ తీవ్రంగా ఉంది. పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు దాదాపు 400 వాటర్ బాటిల్స్ ఉచితంగా అందించడం సంతోషకరం. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో స్పందించి సమాజానికి సహాయం చేయాలి” అని అన్నారు.ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మాభాష, మాజీ కౌన్సిలర్ చాంద్ భాషా, పట్టణ అధ్యక్షుడు బాబు, సోషల్ మీడియా ఇంచార్జి మహమ్మద్ హుస్సేన్, ఎల్ఐసి హుస్సేన్, యూత్ అధ్యక్షుడు మన్సూర్, అలాగే ఇస్మాయిల్, మౌలాలి, జంగిల్ సాహెబ్, బాబు, చాంద్ మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ జి రాంజీ పథకం రద్దు చేయాలి

- సీపీఐ(ఎంఎల్)



**నందికొట్కూరు, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వికసిత్ భారత్ జి రాంజీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి, మాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.సోమవారం పగిడ్యాల మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, “ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి. మంచినీరు, మజ్జిగ, రవాణా సౌకర్యాలు అందించాలి. పేస్ యాప్‌ను రద్దు చేయాలి. కూలీలకు రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలి. 200 రోజులు పని కల్పించాలి. వేసవి అలవెన్స్ 30% ఇవ్వాలి. ప్రతి కూలీకి రూ.10,000 పెన్షన్ కల్పించాలి. పనిస్థలంలో ప్రమాదం జరిగితే రూ.30 లక్షలు, గాయపడితే రూ.5 లక్షలు ఇవ్వాలి” అని డిమాండ్ చేశారు.ప్రభుత్వాలు హామీలను అమలు చేయకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎం. సాములు, జి. జయరాజు, ఎం. సలీం, ఎం. విష్ణువర్ధన్, ఎస్. సలీం, ఎల్. రాజా గౌడ్, జి. నాగన్న, వై. సునీల్, వై. లోకన్నా, కే. ఏసేపు, వై. చక్రి, మాబు, కే. దావీదు, జి. రాజామునీ, ఎస్. వజీర్ భాష, ఎం. శ్రీనివాసులు, బి. గోకారి, పి. శేషన్న, ఏ. జానకిరామ్, ఎం. రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పెట్రో ధరల పెంపుపై వైఎస్ఆర్సీపీ ఆగ్రహం





**నందికొట్కూరు, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం తీవ్ర ఆందోళనకరమని వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డా. సుధీర్ దారా మండిపడ్డారు. ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి, అనంతరం సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని ఆయన విమర్శించారు.వైఎస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు, నందికొట్కూరు పటేల్ కూడలి నుంచి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వరకు ట్రాక్టర్‌కు తాళ్లు కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై వినియోగదారుల అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు.“టీడీపీ మ్యానిఫెస్టోలో ధరలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు




పూర్తిగా విస్మరించడం ఎంతవరకు సమంజసం? దేశంలో పోలిస్తే ఏపీలోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయి. రైతులు, రవాణా రంగం, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర భారం పడుతోంది. నిత్యావసర ధరలు పెరిగి ప్రజల జీవన వ్యయం పెరుగుతోంది” అని ఆయన అన్నారు.35% వ్యాట్ తగ్గించి ప్రజలపై భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. “చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ‘ధరలు పెరిగితే మాకు సంబంధం లేదు’ అనడం విడ్డూరం. స్థానిక మంత్రి జయసూర్య సైకిల్, బైక్‌పై తిరగడం పబ్లిసిటీ కోసం మాత్రమే” అని విమర్శించారు.నంద్యాల ఎంపీ శబరి లోకసభలో పెట్రోల్, డీజిల్ ధరల సమస్యను ప్రస్తావించి ప్రజలపై పడే భారాన్ని తగ్గించాలని కోరారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డా. సుధీర్ దారా డిమాండ్ చేశారు. అనంతరం వైఎస్ఆర్సీపీ శ్రేణులు ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మన్సూర్, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు పాల్గొన్నారు.

# కనీస వేతనం చెల్లించాలని ఆశా వర్కర్ల ధర్నా




**నాగర్‌కర్నూల్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ, “గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి” అని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి పొదిల రామయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన రాజస్వ మండలాధికారిగా బాధ్యతలు స్వీకరించిన పి. పద్మ ప్రియ



**దేవరకొండ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ నూతన రాజస్వ మండలాధికారిగా పి. పద్మ ప్రియ సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి శు భాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఆర్డీఓ మాట్లాడుతూ, “డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తాను. కార్యాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి” అని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లాలో ఎస్‌ఐల బదిలీలు

**నల్లగొండ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఉత్తర్వుల మేరకు నల్లగొండ--యాదాద్రి జోన్--ఎ పరిధిలోని పలువురు సివిల్ ఎస్ఐలకు బదిలీలు, పోస్టింగ్‌లు కల్పించారు. ప్రజా ప్రయోజనం, పరిపాలనా కారణాలతో తక్షణ బదిలీలు అమలు చేశారు.దేవరకొండ ఎస్ఐ కె. సతీష్ను విజయపురి టౌన్ పీఎస్‌కు బదిలీ చేశారు. విజయపురి టౌన్ ఎస్ఐ జి. ముత్తయ్యను వీఆర్, నల్లగొండకు అటాచ్ చేశారు. నల్లగొండ--1 టౌన్ ఎస్ఐ జె. గోపాల్ రావుకు పెద్దవూర పీఎస్ బాధ్యతలు అప్పగించారు. పెద్దవూర ఎస్ఐ వై. ప్రసాద్ను వీఆర్‌కు పంపారు.వీఆర్‌లో ఉన్న డి. విజయ్ కుమార్కు నిడమనూరు పీఎస్ బాధ్యతలు అప్పగించారు. నిడమనూరు ఎస్ఐ యు. సురేష్ను వీఆర్‌కు బదిలీ చేశారు. మిర్యాలగూడ--2 టౌన్ ఎస్ఐ బి. రాంబాబును మర్రిగూడ పీఎస్‌కు బదిలీ చేశారు. మర్రిగూడ ఎస్ఐ ఎం. కృష్ణారెడ్డిను వీఆర్, నల్లగొండకు అటాచ్ చేశారు.జోన్--ఎ యాదాద్రి పరిధిలో బదిలీ ఉత్తర్వులు అమలులోకి వచ్చాయి. తక్షణమే రిలీవ్ అయి కొత్త బాధ్యతలు స్వీకరించాలని ఎస్పీ ఆదేశించారు.

# ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయండి



**ఆమనగల్లు, మే 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండా గ్రామ పంచాయతీలో సోమవారం తహశీల్దార్ ఫాహీం ఖాద్రి పర్యటించి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని బీఎల్ఓ లకు సూచించారు. ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ బీఎల్ఓ లతో కలిసి సమన్వయంతో పనిచేసి మ్యాపింగ్ ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంపత్, బీఎల్ఓ సరోజ్, నాయకులు మల్లేశ్, హరిలాల్, పాండు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ పిట్ ఆక్టివ్ యోగ కార్యక్రమం






**దేవరకొండ మే 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఫిట్ ఆక్టివ్ తెలంగాణ ప్రోగ్రాం లో యోగ మరియు 2కే రన్ దేవరకొండ మునిసిపల్ మరియు మండల పరిధిలో నిర్వహించారు దేవరకొండ ఖిల్లా పార్కు నుండి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు 2కే రన్ నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, మరియు మునిసిపల్ ,మరియు మండల పరిధిలోని వివిధ అధికారులు యూత్ పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేష్, ఎంపిడిఓ డానియల్, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ విటి, సిడిపిఓ చంద్రకళ, ఎంఈఓమాతృనాయక్, ఎఉఈఓరవి, అంజయ్య, నరసింహ ,పిడిలు,జె చంద్రయ్య, రంగనాయక్, తస్లీమ్ ,ఈద్దయ్య ,వెంకట తండా సర్పంచ్ బీముడు, కౌన్సిలర్ సాయి, మున్సిపల్ శానిటర్ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్, యాదయ్య, శ్రీను, బేస్బాల్ ప్లేయర్ మౌనిక, పిఈటి చరణ్, రామకృష్ణ ,పూజ ,అక్షర, మౌనిక, రాకేష్ ,ఎక్సైజ్ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, అంగన్వాడి సిబ్బంది, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

# సైమ' ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షురాలిగా గోలి నవ్య రెడ్డి



**నల్లగొండ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్ (సైమ) అంతర్జాతీయ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షురాలిగా అమెరికా అట్లాంటాకు చెందిన ప్రముఖ ప్రవాస భారతీయురాలు, నల్లగొండ జిల్లా వాస్తవ్యురాలు గోలి నవ్య రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం అట్లాంటా నగరంలో ఘనంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 'సైమ' ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి ఆమెకు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సైమ కార్యకలాపాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడమే ప్రధాన లక్ష్యం. నవ్య రెడ్డి నేతృత్వంలో ఈ విభాగం అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం అవుతుంది. ఆమె తన వృత్తిపరమైన అనుభవంతో బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తారు" అని ఆశాభావం వ్యక్తం చేశారు. తమపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలు అప్పగించినందుకు గోలి నవ్య రెడ్డి 'సైమ' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న సౌత్ ఇండియన్ మీడియా ప్రతినిధులను, ప్రవాస భారతీయులను ఒకే వేదికపైకి తెచ్చి అసోసియేషన్ ఆశయాల సాధనకు శరవేగంగా కృషి చేస్తాను" అని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమెరికాలోని పలువురు ప్రవాస భారతీయులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు పాల్గొని నవ్య రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# 20న దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్



**ఆమనగల్లు, మే 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా మెడికల్ షాప్ ల ఒకరోజు బంద్ పై ఆమనగల్లు మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసిల్దార్, ఎస్ఐ సీతారాం రెడ్డి లకు సోమవారం పట్టణ కేంద్రంలోని ఆయా కార్యాలయాలలో వినతి పత్రం అందించారు. ఆన్ లైన్ లో మెడికల్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల వినియోగంను నివారించాలని, దీంతో సరైన పద్దతిలో వైద్యం అందకపోవడం, నకిలీ బెడద ప్రమాదం ఉందని, ఆన్ లైన్ నుంచి మందుల అమ్మకాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన జాతీయస్థాయిలో మెడికల్ షాపుల బంద్ కు సహకరించాలని వారిని కోరినట్టు ఆమనగల్లు పట్టణ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బిక్కుమాండ్ల యాదయ్య తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో జూలూరి రవీంద్రనాథ్ గుప్తా, ఉప్పుల రాములు, పాపిశెట్టి అరవింద్, కండె ప్రవీణ్, వర్కాల శేఖర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

**- సీఐ వెంకటేశ్వర్లు**



**ఆమనగల్లు, మే 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విఠయిపల్లిలో వీ.పీ.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగింపు కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. ఆటల్లో గెలుపోటములు పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఒకటో వార్డు సభ్యురాలు ధోనిమల్యా, నాయకులు శ్రీనివాస్ రెడ్డి పర్వతాలు, శ్రీధర్ నాయక్, దావీదు, ఎస్ రవీందర్, సురేష్, బలరాం, రవి, తిరుమలయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, సాయి, చంద్ర హర్యా, సత్య, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు రైతు మహాధర్నా



**నల్లగొండ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ముందు రైతుల ఆగ్రహ గర్జన వినిపించింది. ఈ మహా ధర్నాకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, "రేవంత్ సర్కార్ రైతుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైంది. సీఎం గుండెల్లో రైతులు లేరు, రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఉన్నారు. కేసీఆర్ పాలనలో రైతుల కళ్లల్లో ఆనంద భాష్పాలు ఉండేవి, ఇప్పుడు మాత్రం కన్నీళ్లు మాత్రమే ఉన్నాయి" అని మండిపడ్డారు. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయి. మిల్లర్లు తరుగు తీస్తే చెప్పులతో కొడతాం. జిల్లా మంత్రులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారు" అని సంచలన ఆరోపణలు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి హెలికాప్టర్ లేక కాలు కదపరని ఎద్దేవా చేశారు. "రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్న నాయకుడు కేసీఆర్ మాత్రమే. 70 వేల కోట్ల రైతుబంధు ఇచ్చిన ఏకైక నాయకుడు ఆయనే. 18 గంటల రివ్యూలతో కాదు, రైతు పొలాల్లోకి వెళ్లి సమస్యలు చూడాలి" అని ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు డా. గాదరి కిశోర్ కుమార్, ఎన్. భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహ రెడ్డి, కృష్ణా రెడ్డి, రేగట్టే మల్లికార్జున రెడ్డి, ప్రసన్నరాజ్, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరతో ప్రతీ గింజ కొనుగోలు

**- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా**



**అమనగల్లు, మే 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా అన్నారు. సోమవారం మాడుగుల మండలం నాగిళ్ల గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్ పర్సన్ యాట గీత నర్సింహా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అవుతాయన్నారు. రైతులు 17 శాతం తేమ, నాణ్యత ప్రమాణాలతో ధాన్యం తీసుకుని వచ్చి విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



**నంద్యాల, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పలు కీలక విభాగాలను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విభాగం, సోషల్ మీడియా విభాగం, సైబర్ క్రైమ్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ), ఫ్యాక్షన్ జోన్ తదితర విభాగాలను ఆయన సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "ప్రతి విభాగం పోలీస్ శాఖలో అత్యంత కీలకమైనది. విధుల్లో అలసత్వం వహించకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు త్వరితగతిన న్యాయం, మెరుగైన సేవలు అందించడమే మన మొదటి ప్రాధాన్యత" అని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున గుప్తా, సూర్యమౌళి, సబ్-ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, పోలీస్ ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మే 31న తెలంగాణ అమరవీరుల స్మారక స్థూప ఆవిష్కరణ



**ఆమనగల్లు, మే 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల స్మృత్యర్థం డిండి చింతపల్లి గ్రామంలో నిర్మించిన అమరవీరుల స్మారక స్థూప ఆవిష్కరణ సభను మే 31న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు మరియు ఉద్యమకారులకు నేటికీ తగిన గుర్తింపు, గౌరవం దక్కకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఈ ఆవిష్కరణ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పాపిశెట్టి రాము కోరారు. కార్యక్రమంలో మాడుగుల వెంకటయ్య, శేఖర్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి**



**ఆమనగల్లు, మే 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని రాంరెడ్డి లయన్ విజన్ సెంటర్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండ లయన్ రామిరెడ్డి కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, కమిషనర్ రాఘవేంద్ర రెడ్డి లతో కలిసి అధ్యక్షులు గోవర్ధనరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న పేద ప్రజలకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కొనియాడారు. ఈ శిబిరంలో 67 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 23 మంది వృద్ధులకు సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఉచిత శస్త్రచికిత్స కోసం ఏనుగొండ లయన్ రామిరెడ్డి కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో శిబిర ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, కార్యదర్శి గంప శ్రీనివాస్, రమేష్, కొండల్ రెడ్డి, పాండు రెడ్డి, మోహన్ రెడ్డి, పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పది టాపర్‌కు ప్రభుత్వ విప్ సన్మానం

**ఎలిగేడు, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ధూళికట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 514 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా, మండలంలో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఎర్ర నందినిను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించిన ఆయన మాట్లాడుతూ, "భవిష్యత్తులో ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్ రావు, సర్పంచ్ కొమురయ్య, ఉపసర్పంచ్ మేచినేని అండాలు, మాజీ సర్పంచ్ బాలుసాని పరుశరాములు గౌడ్, మాజీ ఎంపిటిసి గోలే భూమేష్, పోల్సాని పుల్లారావు, నరి నేని సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# బీసీలు ప్రభంజనం సృష్టించాలి

-- ముద్దగోని రామ్మోహన్ గౌడ్



**ఎల్బీనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మే 24న ఎల్బీనగర్‌లో జరగబోయే బీసీ ప్రభంజనం సభకు బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముద్దగోని రామ్మోహన్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.సోమవారం బీసీ సభ్యులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ, "రాజకీయాలకు అతీతంగా బీసీలు ఒక్క తాటి పైకి రావాలి. బీసీ వాదం బలపడితే జనాభా ప్రాతిపదికన బీసీలకు వాటా దక్కే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుడు స్థానాలు ఉన్నట్లే బీసీలకు కూడా చట్టసభల్లో రిజర్వుడు స్థానాలు కేటాయించాలి" అని డిమాండ్ చేశారు.ఎల్బీనగర్ నియోజకవర్గంలో 18 డివిజన్లు ఏర్పడిన నేపథ్యంలో కనీసం 50% రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలని ఆయన కోరారు. "మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి. ఎల్బీనగర్‌లో జరగబోయే బీసీ ప్రభంజనం సభ చారిత్రాత్మకంగా నిలుస్తుంది. అన్ని పార్టీల బీసీ నేతలు, విద్యార్థి సంఘాలు, దళిత--గిరిజన--మైనారిటీ సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ సభకు రామ్మోహన్ గౌడ్‌తో పాటు మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీ ప్రసన్న గౌడ్, బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ, సమన్వయకర్త జాల కిషన్, ఎస్సీ ఎస్టీ బీసీ జెఏసి కన్వీనర్ తెలంగాణ వెంకన్న, సభ్యులు బొంగు వెంకటేష్ గౌడ్ తదితరులు హాజరుకానున్నారు.

# రైతులు అధైర్యపడవద్దు

- ప్రతి గింజను కొనుగోలు చేస్తాం
- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



**ఎలిగేడు, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతులు పండించిన వరి ధాన్యం, మొక్కలను ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు.ఎలిగేడు మండలంలోని ధూళికట్ట సింగిల్ విండో కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, ఇప్పటివరకు 24 లారీల ధాన్యం తరలించబడిందని, తూకం పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. "ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాల కోసం బురదజల్లుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోంది" అని అన్నారు.ధూళికట్టలో ఉన్న మొక్కలను ఈ నెల 27లోగా పూర్తిగా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, సర్పంచులు కొమురయ్య, కప్పల ప్రవీణ్, పల్లెర్ల వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బాలుసాని పరుశరాములు గౌడ్, హర్షనపల్లి వెంకటేశ్వరరావు, కొండ తిరుపతి గౌడ్, ఉపసర్పంచులు మేచినేని అండాలు, ముంజం నరేష్, నాయకులు పోల్సాని పుల్లారావు, కోరు కంటి వెంకటేశ్వరరావు, చింతకుంట మనోహర్రావు, గోలే భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించాలని రాయకంటి శ్రీనివాస్ డిమాండ్



**మానకొండూర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాయకంటి శ్రీనివాస్, కూలీలకు ఆరు వారాలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఫోటో క్యాప్చర్, ఐరిస్ విధానాల వల్ల కూలీలు వేతనాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కేంద్రం 90% నిధులు ఇస్తుండగా ఇప్పుడు 60%కి తగ్గించి రాష్ట్రాలపై 40% భారం మోపడం పేదల జీవనాధారానికి దెబ్బతీస్తుందని అన్నారు. మండుటెండలో కేవలం రూ.150 మాత్రమే వేతనం రావడం అన్యాయమని, కనీస వేతనాల ప్రకారం రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రతి కూలికి 200 రోజులు పనులు కల్పించాలని, పనిస్థలాల్లో టెంట్లు, మంచినీరు, పనిముట్లు, ప్రథమ చికిత్స కిట్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కూలీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని రాయకంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చెయ్యాలని బీఆర్ఎస్ నిరసన




**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి.మైనర్ బాలికకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించిన నిరసనకారులు, బండి సంజయ్‌ను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బండి సంజయ్ ఫ్లెక్సీని దగ్ధం చేయడానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఫ్లెక్సీని లాక్కునే క్రమంలో పోలీసులు--బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బండి సంజయ్ మంత్రి పదవిలో కొనసాగితే మైనర్ బాలికకు న్యాయం జరగదని, ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రధాని మోదీ ఆయనను మంత్రివర్గం నుంచి తప్పించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.నిరసనలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.

# దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ



**పెద్దపల్లి, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** దివ్యాంగుల సాధికారతకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఏఎల్ఐఎంసిఓ సంస్థ ఆధ్వర్యంలో, సమగ్ర శిక్ష మరియు జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, సహాయ ఉపకరణాలు వారి దైనందిన జీవితాన్ని సులభతరం చేయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ క్యాంప్‌లో 75 మంది దివ్యాంగులకు 94 ఉపకరణాలు అందజేశారు. వీటిలో ట్రైసైకిళ్లు, సీపీ చెయిర్లు, టీఎల్ఎం కిట్లు, విజువల్ ఇంపెయిర్డ్ కిట్, వీల్ చెయిర్లు, హియరింగ్ ఎయిడ్స్, రోలేటర్ ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శారద, సీఎంఓ కవిత, కోఆర్డినేటర్ మల్లేష్, హెడ్‌మాస్టర్ అరుణ, అన్ని మండలాల ఐఈఆర్పీలు పాల్గొన్నారు.దివ్యాంగుల స్వావలంబనకు ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందని కలెక్టర్ శ్రీహర్ష స్పష్టం చేశారు.

## పిజిఆర్ఎస్ ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్



**నంద్యాల, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ భవనంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల అర్జీలను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా స్వీకరించారు.ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన కలెక్టర్, సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. "ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం మన బాధ్యత" అని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విజయకుమార్ మాతృమూర్తిని పరామర్శించిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి



**నందికొట్కూరు, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వైసీపీ సీనియర్ నాయకుడు చింతా విజయకుమార్ మాతృమూర్తి అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అంకూర్ అపెక్స్ హాస్పటల్‌కు వెళ్లి పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, "భగవంతుని ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలి" అని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు, అభిమానులు కూడా కుటుంబ సభ్యులకు మద్దతు తెలిపారు.

## ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆయన తనయుడు,కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నేనావత్ దేవరన్ నాయక్ మంత్రిని సోమవారం రోజున హైదరాబాద్‌లోని సచివాలయం (సెక్రటెరేట్) లో గల మంత్రి కార్యాలయంలోమర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రితో వారు చర్చించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి




**ఎలిగేడు,మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ యాకన్న సూచించారు.ఎలిగేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, రేషన్ డీలర్లకు ఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, "తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేయాలి. నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలి. రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన వారిని గుర్తించి ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులు చేయాలని బీజేపీ డిమాండ్



**పెద్దపల్లి, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని రామగుండం బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, అనేక గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, వేసవి సెలవుల్లోనే మరమ్మత్తులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ గౌడ్, బోడకుంట సుభాష్, ఊరగొండ అపర్ణ, పాకాల నరసింహారెడ్డి, కోడూరి రమేష్, ఏరుకొండ తిరుపతి, కొమిరె లక్ష్మణ్, మీస వికాస్, శిలారపు కళ్యాణ్, గన్న శ్రీనివాస్, కొట్టె నరేష్ తదితరులు పాల్గొన్నారు.విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మరుగుదొడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని బీజేపీ నేతలు కలెక్టర్‌ను కోరారు.

## ఈఏపీసెట్--2026లో ఫలితాలలో అల్ఫోర్స్ చారిత్రాత్మక విజయం







**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈఏపీసెట్--2026 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు చారిత్రాత్మక విజయాన్ని సాధించారు.ఆగ్రికల్చర్ ĉ ఫార్మసీ విభాగంలో డి. రిత్విక్ 11వ ర్యాంక్, ఇంజనీరింగ్ విభాగంలో పి. చరణ్ 22వ ర్యాంక్ సాధించారు. వీరితో పాటు సి.హెచ్. లక్ష్మీహసిని (74), నిదా (157), పి. అక్షయ (251), ఎల్. అర్యన్ రావు (252), మహ్మద్ హూసేన్ (272), వి. రుచిత (293) తదితరులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. మొత్తం 32 మంది విద్యార్థులు 1,000లోపు ర్యాంకులు, 57 మంది 2,000లోపు, 88 మంది 3,000లోపు, 169 మంది 5,000లోపు ర్యాంకులు సాధించడం విశేషం. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్ ప్రత్యేకతగా నిలిచింది. ఇటీవల ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో కూడా 450 మంది విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్కు అర్హత సాధించడం మరో సంచలనం. పటిష్ట ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాబోయే ఐఐటి అడ్వాన్స్ ,నీట్ ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ ముందంజలో ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఉద్యమకారుల గుర్తింపుకై కమిటీ ఏర్పాటు

**-- శుభ పరిణామం**



**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారుల గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం సుభ సూచకమని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ బండ గోపాల్ రెడ్డి తెలిపారు.ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన, ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, రచయితలు, కళాకారులు, మేధావులు ఇలా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని రాష్ట్ర సాధనకు కృషి చేశారని గుర్తు చేశారు. అలాంటి ఉద్యమకారుల సేవలను అధికారికంగా గుర్తించి చరిత్రలో నిలుపుకోవడం అవసరమని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తుందని, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమంలో కష్టాలు పడిన కార్యకర్తలకు సముచిత గుర్తింపు లభించేలా కమిటీ నివేదిక ఉండాలని కోరారు.ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు చైర్మన్‌గా, సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతి శోభన్ రెడ్డి నియమించడాన్ని ఆయన స్వాగతించారు. ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేసి, వారి సేవలను చరిత్రలో నిలబెట్టాలని బండ గోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మే 22న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం



**సిద్ధిపేట, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యమని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి సమావేశాలు విజయవంతంగా పూర్తయ్యాయని, ఇప్పుడు మే 22న జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు త్రాగునీరు, కూర్చునే సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.సమావేశ ప్రాంగణంలో ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు బీమా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, సన్న వడ్ల ప్రోత్సాహకం, ఆసరా పింఛన్లు వంటి పథకాల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. లబ్ధిదారులను సమావేశంలో పాల్గొనించి వారి అనుభవాలను ప్రజలతో పంచుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్ఓ నాగరాజమ్మతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.మే 22న జిల్లా కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం జరగనుంది.

## ధాన్యం కొనుగోళ్లలో రికార్డు




**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో 50 శాతం వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని, రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.237 కోట్లు జమయ్యాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి కొనుగోలు జరుగుతోందని, ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చిందని, అందులో 1.58 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు.వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 80 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగిందని, వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. హమాలీల సమస్యను స్థానికంగా పరిష్కరించి, లారీ రవాణా సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపుల విషయంలోనూ కరీంనగర్ రాష్ట్రంలో ముందంజలో ఉందని, 78 శాతం ఆన్లైన్ నమోదు పూర్తయిందని, 88 శాతం ధాన్యం మిల్లర్లు స్వీకరించారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## కళాకారుల సంక్షేమానికై ప్రభుత్వ చర్యలు అవసరం

**- వరుకోలు సదానందం**



**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను కరీంనగర్‌లో విడుదల చేసిన జిల్లా అధ్యక్షుడు వరుకోలు సదానందం, ప్రధాన కార్యదర్శి దుడ్డేల సమ్మయ్య మాట్లాడుతూ, సమాజంలోని అన్ని రంగాల కళాకారులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు, పెన్షన్లు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.మే 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా కళాకారులు పాటల ద్వారా ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తారని, అంతరించి పోతున్న కళలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. జానపద, యక్షగాన, బుర్రకథ, ఒగ్గుకథ, వీధి బాగోత కళాకారుల జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని, వారికి గుర్తింపు కార్డులు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కెంసారం కోమల, సహాయ కార్యదర్శులు జక్కి మంజుల, గుర్రం సదానందం, కోశాధికారి బోలుమల్ల రాజమౌళి, సభ్యులు దుడ్డేల రవి, సముద్రాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.కళాకారుల సేవలను గుర్తించి వారికి గౌరవం, సంక్షేమం కల్పించాలని ప్రజానాట్య మండలి నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

## మన ఊరు--మన బడి బిల్లులు చెల్లించాలని వినతి




**హుస్నాబాద్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలకు చెందిన కాంట్రాక్టర్లు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపిటీసీలు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం వినతిపత్రం సమర్పించారు.గత ప్రభుత్వ హయాంలో మన ఊరు--మన బడి కార్యక్రమం కింద పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టగా, కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. అయితే 25 నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో భూములు, నగలు అమ్మి అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి బిల్లులు చెల్లించని పక్షంలో తాము అభివృద్ధి చేసిన పాఠశాలలకు తాళాలు వేసి తిరిగి ప్రారంభం కాకుండా చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ వినతిపత్రం సమర్పణలో గునుకుల మాధవ్ రెడ్డి, జనగామ శ్రీనివాసరావు, ఎం. సంపత్ రావు, కె. మధుసూదన్ రెడ్డి, పొన్నబోయిన శ్రీనివాస్, కర్ర మనోహర్, కే. రామచంద్రారెడ్డి, బి. తిరుపతిరెడ్డి, వి. శంకర్, సత్యనారాయణ, సతీష్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కలెక్టర్‌ను కోరారు.

# రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**- రైతు మృతి**










**తిమ్మాపూర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులపూర్ గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రైతు కాంతల రాజిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు.రైతు ట్రాక్టర్‌ను వెనకనుండి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. అనంతరం లారీ డ్రైవర్ అక్కడినుండి పరారయ్యాడు.ఈ ఘటనను గమనించిన గన్నేరువరం మండలం మైలారం గ్రామానికి చెందిన నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి బుర్ర చంద్రశేఖర్ గౌడ్ వెంటనే లారీని వెంబడించి, కరీంనగర్ శనివారం మార్కెట్ సమీపంలోని శ్రీకృష్ణ ఆలయం దగ్గర లారీని గుర్తించారు. మాజీ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి సహకారంతో డ్రైవర్‌ను పట్టుకుని తిమ్మాపూర్ పోలీసులకు అప్పగించారు.లారీ డీజిల్ ట్యాంక్ డ్యామేజ్ కావడంతో రోడ్డుపై పడిన డీజిల్ ఆనవాళ్ల ఆధారంగా లారీని వెంబడించి పట్టుకున్నానని రిపోర్టర్ చంద్రశేఖర్ తెలిపారు.ప్రమాదానికి గురైన లారీ నంబర్ ఏపీ 29 వి 1555 కాగా, డ్రైవర్ పేరు మొహాద్ ఎస్సా అని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.లారీ డ్రైవర్‌ను పట్టుకున్న నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి బుర్ర చంద్రశేఖర్ గౌడ్‌ను ఎస్ఐ, గ్రామ ప్రజలు అభినందించారు.

# డిసిసి కార్యాలయంలో పి.ఎ.సి అత్యవసర సమావేశం



**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన డిసిసి కార్యాలయంలో జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్న కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో పాటు జిల్లాకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు.సమావేశంలో వరి ధాన్యం కొనుగోలు, ఎస్ఐఆర్ ఓటరు జాబితా సవరణ, బీఎల్ఏ-2 నియామకం, వేసవిలో తాగునీటి సమస్య, పార్టీ నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు అవకాశం కల్పించాలనే అంశాలపై చర్చ జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వరి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని, రైస్ మిల్లర్లు, దళారుల మోసాలను అరికట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ పేరుతో సెక్యులర్ ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.బీఎల్ఏ-2 నియామకాన్ని వెంటనే పూర్తి చేసి, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు సహాయం చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్న కుమార్ మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్న కార్యకర్తలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, జిల్లా నేతలు పాల్గొన్నారు.రైతు సమస్యలు, ఓటరు జాబితా సవరణ, తాగునీటి సమస్యలపై కాంగ్రెస్ నేతలు సమగ్ర చర్చ జరిపారు.

# రా రైస్ మిల్లర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం



**సిద్ధిపేట, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లా కలెక్టర్ కె. హైమావతి రా రైస్ మిల్లర్లతో సమావేశమై ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తూ లక్షన్నర మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో జిల్లాలో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల వరి పండగా, అందులో ఐదు లక్షల మెట్రిక్ టన్నులను ప్రభుత్వం కొనుగోలు చేయనున్నదని, ఇప్పటికే లక్షా 80 వేల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తైందని తెలిపారు.గ్రామాల వారీగా మిల్లుల వారీగా ధాన్యం కేటాయింపు చేపడతామని, మిల్లర్లు కనీసం 40 శాతం సామర్థ్యంతో ధాన్యం దిగుమతి చేసుకోవాలని సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో సన్న రకం వరి సాగుకు రైతులను ప్రోత్సహించే దిశగా మిల్లర్లు కూడా అవగాహన కల్పించాలని కోరారు.ఇదిలా ఉండగా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన 98 దరఖాస్తులను సత్వర పరిష్కారం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలు నమ్మకంతో ప్రజావాణికి వస్తున్నారని, ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు.

# రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదుకై ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం



**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భారత రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ అధ్యక్షురాలు చిత్రా మిశ్రా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ (క్రిమినల్ కేసులు లేనివారు) సభ్యత్వం పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారమ్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ ప్రతిని సమర్పించి రూ.1,100 శాశ్వత సభ్యత్వ ఫీజు చెల్లించాలని సూచించారు. సభ్యత్వం పొందిన వారికి శాశ్వత సభ్యత్వ కార్డు అందజేయబడుతుందని చెప్పారు. ఇప్పటికే సభ్యత్వం పొందిన వారు తమ మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాల్లో మార్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. సభ్యుల వివరాలు సకాలంలో నవీకరించుకోవడం ద్వారా భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాల్లో సమర్థవంతంగా పాల్గొనవచ్చని, అత్యవసర పరిస్థితుల్లో అర్హతగల సేవలు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మే 15 నుండి జూన్ 15 వరకు ప్రతి రోజు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు (ఆదివారం సెలవు) రెడ్ క్రాస్ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని చైర్మన్ కేశవరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, రెడ్ క్రాస్ చైర్మన్ పి. కేశవరెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్ రావు, సభ్యులు పాల్గొన్నారు.ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకుని రెడ్ క్రాస్ సేవలను విస్తరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# బీసీ స్టడీ సర్కిల్ సమక్షంలో ఏఐ, లైఫ్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ

**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఏఐ, లైఫ్ స్కిల్స్‌పై నాలుగు రోజుల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఎం. రవి కుమార్ తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఈ శిక్షణ మే 27 నుంచి 30 వరకు జరుగనుంది.18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల ఇంటర్, డిప్లమా, డిగ్రీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు మే 19 నుంచి 26 వరకు సాయంత్రం 5 గంటలలోపు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తు సమయంలో స్టడీ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు సమర్పించాలి. మరిన్ని వివరాల కోసం 08782-268686ను సంప్రదించవచ్చని తెలిపారు. ఏఐ, లైఫ్ స్కిల్స్ శిక్షణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయి.

# కలెక్టరేట్‌లో సాంకేతిక ఇబ్బందులు



**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హెల్ప్‌డెస్క్ వద్ద ఒకేసారి భారీ సంఖ్యలో ప్రజలు చేరడంతో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో దాదాపు గంటపాటు దరఖాస్తుల నమోదు నిలిచిపోయింది.ఎండలో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు అసహనానికి గురయ్యారు. అనంతరం అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో నమోదు ప్రక్రియ మళ్లీ ప్రారంభమైంది. సమస్య సద్దుమణగడంతో ఫిర్యాదుదారులు ఊపిరి పీల్చుకున్నారు.సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిన ప్రజావాణి నమోదు ప్రక్రియ తిరిగి సజావుగా కొనసాగింది.

# ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి హామీ



**తిమ్మాపూర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో ఆశా వర్కర్లు అందించిన వినతిపత్రాన్ని ఆయన స్వీకరించారు.ఆశా వర్కర్ల వేతనాలను నెలకు రూ.18 వేలుగా స్థిరీకరించి, ప్రతి నెలా ఒకటవ తేదీన చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, ఇప్పటి వరకు వేతన స్థిరీకరణ జరగకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచడమే కాకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని, 50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు ఇవ్వాలని, ఆదివారం సెలవుదినంగా ప్రకటించాలని, పండుగలకు సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక రెస్టు రూములు ఏర్పాటు చేయాలని, పనిభారం తగ్గించాలని, ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, క్వాలిటీ యూనిఫాం అందించాలని ఆశా వర్కర్లు వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సారిక, తిమ్మాపూర్ మండల అధ్యక్షురాలు రజితతో పాటు సుమారు 50 మంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.ఆశా వర్కర్ల న్యాయమైన కోరికలు నెరవేర్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు.

# తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ నిరసన




**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

భగీరథ్ ఫోక్సో కేసు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతున్న వేళ, కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా చేపట్టారు. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ నేతృత్వంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.బాధితురాలికి న్యాయం చేయాలి, చట్టం ముందు అందరూ సమానమే అంటూ నినాదాలతో ప్రాంతమంతా మార్మోగింది. రవీందర్ సింగ్ మాట్లాడుతూ మైనర్ బాలిక కేసులో కేంద్ర మంత్రి పేరు రావడం బాధాకరమని, నిష్పాక్షిక దర్యాప్తు జరగాలంటే ఆయన వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.నాయకులు మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, రాజకీయ ప్రభావాలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ ధర్నా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# జర్నలిస్టుల సంక్షేమ సంఘంలో వోడ్నాల లతకు కీలక బాధ్యతలు



**పెద్దపల్లి, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఈసీ మెంబర్‌గా పెద్దపల్లి జిల్లాకు చెందిన వోడ్నాల లతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.హన్మకొండ ఆదర్శ లా కాలేజీలో జరిగిన రాష్ట్ర ప్రథమ సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగంటి రాజుతో కలిసి వోడ్నాల లతను రాష్ట్ర కార్యదర్శి, ఈసీ మెంబర్‌గా ప్రకటించారు.ఈ సందర్భంగా లత మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం పోరాటం చేస్తానని, జర్నలిస్టులను ఐక్యం చేసి సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.జర్నలిస్టుల హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానని వోడ్నాల లత స్పష్టం చేశారు.

## తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సమక్షంలో ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం

**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కరీంనగర్ ప్రేరణ రీజియన్--9 ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం మంగళవారం ఉదయం 9 గంటలకు పద్మానగర్ ఇందిర గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో జరగనుంది.ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి పదవ తరగతి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సన్మానించనున్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. ముఖ్య అతిథి సురేష్ ఆత్మారామ్ మహరాజ్ విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తారు. గత రెండు సంవత్సరాలుగా ఈ సంస్థలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి సన్మానిస్తున్నాయి.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు.



# మోదీకి నార్వే అత్యున్నత పౌర పురస్కారం



**ఒస్లో, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నార్వే అత్యున్నత పౌర పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేయిన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను ప్రధాని మోదీ అందుకున్నారు. మొదటిసారి తమ దేశానికి వచ్చిన భారత ప్రధాని మోదీని సోమవారం నార్వే కింగ్ హెరాల్డ్-5 దేశ అత్యున్నత పురస్కారంతో సత్కరించారు. నార్వే, మానవాళి శ్రేయస్సు కోసం విశిష్ట సేవలు అందించిన విదేశీయులు, నార్వే పౌరులకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రధాని మోదీకి ఇది 32వ అంతర్జాతీయ పురస్కారం. ఐదు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం ప్రధాని మోదీ నార్వేలోని ఒస్లోలో అడుగుపెట్టారు. భారత ప్రధానికి నార్వే ప్రధాని జోనాస్ గాహ్ స్టోర్ సాదర స్వాగతం పలికారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో భారత్‌కు అండగా నిలబడ్డ నార్వేకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# చైనాలో భూకంపం..

### రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రత నమోదు



**న్యూఢిల్లీ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చైనాలోని గ్వాంగ్జీలో భూకంపం సంభవించింది. ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలు పై 5.2 గా నమోదైంది. ఈ భూకంపం మూలంగా జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. లియుజౌ నగరంలో 7,000 మందికిపైగా నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భూకంప ప్రభావిత నైరుతి ప్రాంతంలో గాలింపు, సహాయక చర్యలు ముగిశాయి. భూకంపం నేపథ్యంలో రవాణాకు అంతరాయం కలుగుతోందని అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులను ఉటంకిస్తూ ప్రభుత్వ మీడియా జిన్హువా తెలిపిన వివరాల ప్రకారం.. శిథిలాల కింద చిక్కుకున్న 91 ఏళ్ళ వృద్ధుడిని అధికారులు కాపాడారు. ఈ భూకంపం కారణంగా మరణించిన ఇద్దరిలో 63 ఏళ్ళ పురుషుడు, 53 ఏళ్ళ మహిళ ఉన్నారు. వీరు దంపతులని అధికారులు తెలిపారు. గల్లంతైన వారి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. గాయపడిన నలుగురిని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదని జిన్హువా వెల్లడించింది. భూకంపం కారణంగా సోమవారం తెల్లవారుజామున లియుజైలో పదమూడంతస్తుల భవనాలు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో పలు ప్రాంతాలకు వెళ్ళే దారులు మూసుకుపోయాయి. ఎత్తైన భవనాల నుంచి ప్రజలు భయంతో బయటకు పరుగు తీశారు. వందల ఇళ్ళు కూలిపోయాయి

# ఇమ్రాన్ పదవీచ్యుతి వెనక అమెరికా!

### 'అన్నీ క్షమించబడతాయన్న' కేబుల్ లీక్



**ఇస్లామాబాద్:మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పదవీచ్యుతి వెనుక అమెరికా పాత్రపై ప్రశ్నలు తలెత్తాయి. ఒక దౌత్య కేబుల్ లీక్ తో ఈ అంశం చర్చకు వచ్చింది. తమ దేశంలో అమెరికా మద్దతుతో పాలన మార్పు జరిగిందని ఇమ్రాన్ చేసిన ఆరోపణలను బలపరుస్తూ..'సైఫర్'గా పిలిచే పత్రాన్ని పరిశోధనాత్మక సంస్థ 'డ్రాప్ సైట్' ప్రచురించింది. ఏప్రిల్ 2022లో ఇమ్రాన్ ఖాన్ విశ్వాస తీర్మానంలో ఓడిపోవడానికి ముందు వాషింగ్టన్‌లోని పాక్ రాయబారికి, అమెరికా విదేశాంగ శాఖ సీనియర్ అధికారి డొనాల్డ్ లూకు మధ్య జరిగిన సమావేశ వివరాలు నమోదయ్యాయి.'అన్నీ క్షమించబడతాయి' అనే పద బంధం అందులో వాడారు. పాక్-అమెరికా సంబంధాల బలోపేతానికి సంబంధించి ఆ పదాలను ఒక స్పష్టమైన సంకేతంగా భావిస్తున్నారు. అమెరికాతో తాను ఏకీభవించడానికి నిరాకరించడం వల్లే తనను పదవి నుంచి తొలగించడానికి అమెరికా తెర వెనక పని చేసిందని గతంలో ఇమ్రాన్ ఆరోపించారు.

# స్క్వాడ్రన్ లీడర్ సాన్యా చారిత్రక ఘనత

### తొలి మహిళా క్యాట్-ఏ క్యూఎఫ్ఐగా అర్హత



**న్యూఢిల్లీ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రతిష్ఠాత్మక క్యాట్-ఏ క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్పెక్టర్(క్యూఎఫ్ఐ) అర్హతను పొందిన తొలి మహిళా అధికారిగా స్క్వాడ్రన్ లీడర్ సాన్యా చరిత్రాత్మక ఘనతను సాధించినట్లు భారతీయ వైమానిక దళం(ఐఏఎఫ్) సోమవారం తెలిపింది. ఇది ఐఏఎఫ్‌కు గర్వించదగిన ఒక మైలురాయిగా అభివర్ణించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక విమానయాన నిపుణులకు స్ఫూర్తిదాయకమని ఒక పోస్టు లో ఐఏఎఫ్ పేర్కొంది. ఐఏఎఫ్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్క్వాడ్రన్ లీడర్ సాన్యను సత్కరిస్తున్న ఫోటోలను కూడా ఐఏఎఫ్ పంచుకుంది.

# బొమ్మ శ్రీరామ్‌కు ఆత్మీయ సన్మానం

**కరీంనగర్, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మొదటిసారి కరీంనగర్‌కు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నేతలు, కాపు సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఇందిరా గార్డెన్ వరకు కొనసాగింది. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కన్ సింగ్ ఠాకూర్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్, లైబ్రరీ చైర్మన్, కార్పొరేటర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ బొమ్మ శ్రీరామ్ నియామకం బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదం చేస్తుందని, ఆయన నాయకత్వంలో మున్నూరు కాపు కార్పొరేషన్ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బలహీన వర్గాల



సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. బొమ్మ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాలు మరింత మెరుగుపడతాయి అన్నారు. బొమ్మ శ్రీరామ్ మాట్లాడుతూ తన తండ్రి బొమ్మ వెంకన్న ఆశీర్వాదంతో ఈ పదవి లభించిందని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, మున్నూరు కాపు కార్పొరేషన్ అభివృద్ధి కోసం పనిచేస్తానని తెలిపారు. కరీంనగర్ కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం జిల్లాలో రాజకీయ ఉత్సాహాన్ని రేకెత్తించింది.

# వరి కొనుగోలు ఆలస్యంపై రైతుల ఆవేదన

**సిద్దిపేట, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ మండలంలోని 27 గ్రామాల రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోందని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కోహెడ మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా సరైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంట పొలాల్లో పండించిన వరి గోదాముల్లో, ఇండ్ల వద్ద, కొన్నిచోట్ల పొలాల దగ్గరే పేరుకుపోతుందని, ఎండలో వడ్లు ఎండబెట్టడం, రాత్రిళ్లు కాపలా కాయడం రైతుల నిత్యకృత్యంగా మారిందని అన్నారు. వర్షం వస్తే పంట



పాడవుతుందనే భయం, ఎండలో ఎక్కువసేపు ఉంచితే నాణ్యత తగ్గుతుందనే ఆందోళనతో రైతులు మానసికంగా కుంగిపోతున్నారని రాజు పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలు గమనించినా స్పందించడం లేదని విమర్శించారు. మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం రైతులను నిరాశపరుస్తోందని, వరి కొనుగోలు ప్రక్రియను తక్షణమే వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు చల్ల భూపాల్ రెడ్డి, మల్లారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు. రైతుల పక్షాన నిలబడి తక్షణ చర్యలు తీసుకోవాలి" అని పిడిశెట్టి రాజు ప్రభుత్వాన్ని కోరారు.

# భారత మొదటి బుల్లెట్ ట్రైన్ ఫస్ట్ లుక్ విడుదల

### ముంబై--అహ్మదాబాద్ మధ్య ప్రయాణించనున్న రైలు

**న్యూఢిల్లీ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇండియాలో త్వరలో బుల్లెట్ ట్రైన్ రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ రైలుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసింది. న్యూఢిల్లీలోని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ కార్యాలయ బిల్డింగ్ గేట్ నెంబర్ 4 వద్ద కొత్త బుల్లెట్ ట్రైన్‌కు సంబంధించిన ఫొటోను ఏర్పాటు చేశారు. ఈ ఫొటో అక్కడున్న వారిని ఆకర్షిస్తోంది. ఈ ఫొటో ద్వారా ఇండియాలో అందుబాటులోకి రానున్న తొలి బుల్లెట్ ట్రైన్ నిర్మాణంపై ఒక స్పష్టత వచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించింది. ఇండియా తొలి బుల్లెట్



ట్రైన్‌గా నిలవనున్న ఈ రైలు ముంబై--అహ్మదాబాద్ నగరాల మధ్య ప్రయాణిస్తుంది. ఇది వచ్చే ఏడాది స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగష్టు 15న అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ రైలు అందుబాటులోకి వస్తే ముంబై నుంచి అహ్మదాబాద్.. అహ్మదాబాద్ నుంచి ముంబై రెండు గంటల్లోనే చేరుకోవచ్చు. ఈ రైలు మొత్తం 508 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ముంబై, థానే, విరార్, బోయిసర్, వాపి, బిల్లిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి నగరాలలో ప్రయాణిస్తుంది. ఈ బుల్లెట్ ట్రైన్ ఆగేందుకు ప్రత్యేక స్టేషన్ల నిర్మాణం కూడా కొనసాగుతోంది. ఇది మొత్తం 17 నదుల పై నున్న బ్రిడ్జిల మీద నుంచి ప్రయాణిస్తుంది. ఇందులో ప్రముఖమైన నర్మదా, మహి, తప్తి, సబర్మతి నదుల మీదుగా కూడా వెళ్తుంది. ఈ రైలు కోసం పట్టాల నిర్మాణానికి అవసరమైన 1,389.5 హెక్టార్ల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ రైలు కోసం ముంబై పరిధిలోని విక్రోలిలో ఒక భారీ టన్నెల్ తవ్వుతున్నారు. 13.6 మీటర్ల డయామీటర్‌తో ఇది 16 కిలోమీటర్లు ఉంటుంది.

# పొదుపు పాటించండి

### -ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసికి కేంద్రం ఆదేశం
### -- విద్యుత్ వాహనాలు వాడాలని సూచన

**న్యూఢిల్లీ, మే 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, ఎల్ఐసి, ఇతర ఆర్థిక సంస్థలు పొదుపు చర్యలు పాటించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ నుండి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, పశ్చిమాసియా వివాదాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని తగ్గించడానికి ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసి, ఇతర ఆర్థిక సంస్థలు కఠినమైన



పొదుపు చర్యలను పాటించాలని ఆదేశించింది. ఛైర్మన్లు, ఎండి, సిఇఒ తదితర ఉన్నత స్థాయి అధికారుల విదేశీ ప్రయాణాలపై ఆంక్షలు విధించడంతో పాటు, భౌతికంగా హాజరుకావడం తప్పనిసరి అయితే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలను కేవలం వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ వ్యయ నియంత్రణ చర్యలతో పాటు, పర్యావరణ పరిరక్షణ.
ఇంధన ఖర్చుల తగ్గింపుపై కూడా దృష్టి సారించాలని సూచించింది. సంస్థల ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత త్వరగా దశలవారీగా విద్యుత్ వాహనాలను (ఇవి) ప్రవేశపెట్టాలని ఆదేశించింది. రూపాయి విలువ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోవడం, ద్రవ్యోల్బణం పెరిగే ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ కఠిన నిబంధనలను అమలులోకి తెచ్చిందని తెలిపింది.

# బిజినెస్

# దిగి వస్తున్న బంగారం, వెండి ధరలు..

బంగారం, వెండి ధరలు శుభవార్త చెబుతున్నాయి. గత నాలుగు రోజుల కిందట ఒక్కసారిగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. తాజాగా మే 18వ తేదీన కూడా తగ్గుముఖం పడుతున్నాయి. దేశీయంగా తులం బంగారం ధర రూ.1,56,920 ఉంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగచ్చు.

హైదరాబాద్ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

విజయవాడ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

ఢిల్లీ -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,070 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,990 వద్ద కొనసాగుతోంది.



ముంబై -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

చెన్నై -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,47,490 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరు -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

కోల్‌కతా -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

## ఐడిబిఐ బ్యాంక్ విక్రయానికి మళ్లీ కసరత్తు.!




**న్యూఢిల్లీ**

ఐడిబిఐ బ్యాంక్‌ను ప్రయివేటు లేదా విదేశీ సంస్థలకు విక్రయించడానికి కేంద్ర ఆర్థిక శాఖ మరోమారు కసరత్తు చేస్తోందని సమాచారం. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన బిడ్‌లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో నిలిచిపోయిన ఐడిబిఐ బ్యాంక్ మెజారిటీ వాటా విక్రయ ప్రక్రియను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు కనీస రిజర్వ్ ధరను 20 శాతం వరకు తగ్గించడంతో పాటు, బ్యాంక్ రోజువారీ షేర్ మార్కెట్ ధరపై కాకుండా దాని అంతర్గత విలువ ఆధారంగా ధరను నిర్ణయించాలని అధికారులు భావిస్తున్నారు. గత మార్చిలో బిడ్‌లు రద్దయిన ఈ ప్రక్రియలో కెనడియన్ బిలియనీర్ ప్రేమ్ వత్సకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్, ఎమిరేట్స్ ఎన్‌బిడి రేసులో నిలవగా, వాల్యుయేషన్ ఎక్కువగా ఉండటంతో కోటక్ మహీంద్రా బ్యాంక్ వెనుకడుగు వేసింది. ఐడిబిఐ బ్యాంక్‌లో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, ఎల్‌ఐసిలకు కలిసి దాదాపు 95 శాతం వాటాలున్నాయి. అందులో మెజారిటీ 60.7 శాతం ఉమ్మడి వాటాను విక్రయించాలని యోచి స్తున్నాయి. ఈ ప్రయివేటీకరణ ప్రక్రియను ఎలాగైనా ముందుకు తీసుకెళ్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కొత్త బిడ్లను ఆహ్వానించే యోచనలో అధికారులు ఉన్నారు.

## ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు..!

: ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలు ఇతర ఆర్థిక సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీచేసింది. ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని సోమవారం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలు విధించడంతోపాటు దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని స్పష్టంచేసింది. ఈ కొత్త నిబంధనలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి దిగ్గజ సంస్థలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించనున్నాయి.కేంద్ర ఆర్థిక సేవల విభాగం తాజా ఉత్తర్వులు జారీచేసింది. అత్యవసరమైతే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలని కేంద్రం



సూచించింది. సంస్థల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈఓ) విదేశీ ప్రయాణాల్లో పరిమితి పాటించాలని తెలిపింది. సాధ్యమైనంత వరకు విదేశీ సమావేశాలకు వర్చువల్‌గానే హాజరుకావాలని పేర్కొన్నది. వీటితోపాటు ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత వరకు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతలవల్ల ఏర్పడే ఆర్థిక ప్రభావాలను తట్టుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని ప్రధానమంత్రి మోదీ గతవారం పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్రిక్తతలవల్ల దేశ ఆర్థికవృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే భారత కరెన్సీ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే పలు రాష్ట్రాలు తమ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' సౌకర్యాన్ని కూడా కల్పించాయి.

# స్పోర్ట్స్

## కోల్‌కతా మేనేజ్‌మెంట్‌పై బీసీసీఐ సీరియస్!

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ కీలక ఘట్టానికి చేరుకుంటున్న వేళ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఒక సరికొత్త వివాదం చుట్టుముట్టింది. శనివారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయంతో తీవ్రంగా ఇబ్బంది పడినప్పటికీ, అతనితో బలవంతంగా మ్యాచ్‌ను కొనసాగించడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీల గెలుపోటముల కంటే దేశీయ ఆటగాళ్ల ఫిట్‌నెస్, భద్రత ముఖ్యమని భావించే భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఈ వ్యవహారాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో వరుణ్ చక్రవర్తి పాదానికి గాయమైంది. సాధారణంగా ఆటగాడికి గాయమైతే వెంటనే మైదానం వెలుపలికి పంపి ఫిజియో పర్యవేక్షణలో ఉంచాలి. కానీ కేకేఆర్ కెప్టెన్ మరియు మేనేజ్‌మెంట్ మాత్రం వరుణ్ చక్రవర్తితో అతని నాలుగు ఓవర్ల పూర్తి కోటాను వేయించింది. బంతిని విసిరిన ప్రతిసారీ, రనప్ సమయంలోనూ వరుణ్ తీవ్రమైన నొప్పితో నడవలేక ఇబ్బంది పడటం లైవ్ టెలికాస్ట్ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. సోషల్ మీడియాలో ఈ వీడియో క్లిప్స్ వైరల్‌గా మారడంతో, కేకేఆర్ జట్టు మేనేజ్‌మెంట్ కేవలం మ్యాచ్ గెలవడం కోసమే ఆటగాడి కెరీర్‌ను రిస్క్‌లో పడేసిందంటూ నెటిజన్లు, మాజీ క్రికెటర్లు తీవ్ర




విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై బీసీసీఐ ఉన్నతాధికారులు మరియు నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్య బృందం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఢిల్లీ వర్గాల ద్వారా తెలిసింది. వరుణ్ చక్రవర్తి బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టు ( లో ఉన్న ఆటగాడు. బోర్డు నిబంధనల ప్రకారం.. కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లకు ఐపీఎల్ సమయంలో ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలు లేదా గాయాలు తలెత్తినా ఫ్రాంచైజీలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. గాయం తీవ్రతను దాచిపెట్టి లేదా నొప్పిని భరిస్తూ ఆటగాళ్లను మైదానంలోకి దించడం నిబంధనలకు విరుద్ధం. రాబోయే అంతర్జాతీయ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని, ఆటగాళ్ల 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్'ను పర్యవేక్షించే బాధ్యత ఎన్‌సీఏ పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో కేకేఆర్ ఫ్రాంచైజీ వరుణ్ చక్రవర్తి శారీరక ఫిట్‌నెస్‌ను నిర్లక్ష్యం చేయడంపై బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు అంతర్గత సమాచారం.బీసీసీఐ జోక్యం చేసుకోవడం మరియు బోర్డు నుండి గట్టి హెచ్చరికలు రావడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ మేనేజ్‌మెంట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వరుణ్ చక్రవర్తి పాదానికి తగిలిన గాయం మరింత తీవ్రం కాకుండా ఉండేందుకు, అతనికి రాబోయే కొన్ని మ్యాచ్‌ల పాటు పూర్తి విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో కేకేఆర్ ఆడబోయే తదుపరి కీలకమైన మ్యాచ్‌కు వరుణ్ చక్రవర్తి ప్లేయింగ్ ఎలెవన్ (తుది జట్టు) కు దూరం కావడం దాదాపు ఖాయమైంది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతున్న తరుణంలో తమ ప్రధాన వికెట్ టేకింగ్ స్పిన్నర్ గాయం బారిన పడటం, అది వివాదాస్పదంగా మారడం కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి.

## ఆగస్టులో శ్రీలంకకు టీమిండియా.. టీ20 సిరీస్‌పై స్పష్టత వచ్చేనా..!



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా భారత జట్టు ఆగస్టులో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. లంక గడ్డపై రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది టీమిండియా. ఆగస్టు రెండో వారం నుంచి ఇరుజట్లు తలపడుతాయని సమాచారం. అయితే.. ఇప్పటివరకూ శ్రీలంక క్రికెట్ షెడ్యూల్‌ను ప్రకటించలేదు. మొత్తంఅ రెండు వారాల్లో సిరీస్ నిర్వహించాలని లంక భావిస్తోంది. ఆగస్టు 15 నుంచి 27 మధ్య మ్యాచ్‌లు ఉంటాయని క్రిక్‌బజ్‌తో బీసీసీఐ, శ్రీలంక క్రికెట్ వెల్లడించాయి.లంక ప్రీమియర్ లీగ్ అనంతరం భారత్, లంక మధ్య సిరీస్ జరుగనుంది. ఎల్‌పీఎల్ ఆగస్టు 9న ముగియనుంది. అంటే.. ఆగస్టు 15 నుంచి టెస్టు సిరీస్ షురూ కానుంది. అలానే ఇరుజట్ల మధ్య పొట్టి సిరీస్‌పై కూడా స్పష్టత రావాల్సి ఉంది. అయితే.. అవినీతిమయమైన లంక బోర్డును ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే రద్దు చేశారు. ప్రస్తుతం శ్రీలంక క్రికెట్ ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ బాధ్యతలు చూసుకుంటోంది.

దాంతో.. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఈమధ్యే ఐసీసీ ప్రతినిధిగా లంకకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించాడు. ఈ క్రమంలోనే నిరుడు దిత్వా తుఫాన్ బాధితుల కోసం నిధుల సమీకరణకు భారత్, శ్రీలంక మధ్య మూడు టీ20ల సిరీస్‌పై చర్చించినట్టు సమాచారం.

**జూన్ 6 నుంచి**

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ మే 31న ముగియడంతో.. జూన్ 6న భారత జట్టు అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ముల్లన్‌పూర్‌లో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టులో ఆపై.. మూడు వన్డేల సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ సేన తలపడనుంది. అనంతరం ఐర్లాండ్, ఇంగ్లండ్, జింబాబ్వే పర్యటనల అనంతరం శ్రీలంకకు టీమిండియా వెళ్లనుంది.

## రవీంద్ర జడేజా ఆడకపోవడంపై విమర్శలు

ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆడకపోవడం ఇప్పుడు అనేక ప్రశ్నలు, అనుమానాలకు తావిచ్చింది. హాట్ డిబేట్ కు తెర తీసింది. ప్లేఆఫ్స్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్ కు డుమ్మా కొట్టడం పట్ల విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మేనేజ్మెంట్ వ్యూహాత్మకంగా అతన్ని తప్పించిందా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. రవీంద్ర జడేజా ఆడకపోవడం పట్ల ఇంగ్లాండ్ మాజీ కేప్టెన్ మైఖెల్ వాన్ ఈ అనుమానాలు లేవనెత్తారు. అతను ఎందుకు దూరమయ్యాడని ప్రశ్నించారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా రవీంద్ర జడేజా విశ్రాంతి తీసుకుంటున్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చెప్పినప్పటికీ, దీనికి వేరే కారణం ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ అనేది సమస్యే కాదని తేల్చి చెప్పారు.రవీంద్ర జడేజాకు ఏం జరిగిందో



తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది. చిన్నపాటి సమస్యకు అతను మ్యాచ్ నుంచి తప్పుకోడు. విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా పనిభార నిర్వహణ పేరు చెప్పడం వింత. అతనికి ఏదో సమస్య ఉందనేది స్పష్టం. అతను మ్యాచ్ ఆడాలని కోరుకుంటున్నా.." అని పేర్కొన్నారు. బ్యాటింగ్ పతనం కాకుండా జడేజా అడ్డుకునేవాడని, మిచెల్ స్టార్క్‌పై భారీ షాట్లతో ఎదురుదాడికి దిగేవాడని తేల్చి చెప్పారు. ఎడమచేతి స్పిన్ బౌలర్ కావడం వల్ల పరుగులను కూడా కట్టడి చేసేవాడని వివరించారు.రియాన్ పరాగ్ కెప్టెన్సీని కూడా మైఖేల్ వాన్ తప్పుబట్టారు. ఢిల్లీ ఛేజింగ్‌లో 18వ ఓవర్‌లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ డొనోవన్ ఫెరీరాను బౌలింగ్‌కు దించడాన్ని వాన్ విమర్శించారు. "డొనోవన్ ఫెరీరాను బౌలింగ్ చేయించిన వ్యూహాత్మక నిర్ణయాన్ని నేను ప్రశ్నించాల్సిందే. ఇద్దరు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారని భావించి పార్ట్‌టైమ్ ఆఫ్-స్పిన్నర్‌ను ప్రవేశపెట్టారా? అది గొప్ప నిర్ణయం కాదు, అనవసరం.. అని వాన్ అన్నారు.